RNI No : APTEL 2020/80757

www.sreeprasthanam.in

శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక

ఎపిలో ఛానళ్లపై నిషేధం ఎత్తివేత

అసెంబ్లీలో ఛానళ్ల ప్రవేశంపై నిషేధం ఎత్తేస్తూ స్పీకర్ ఆదేశాలు

అమరావతి,జూన్22(ఆర్ఎన్ఎ): అక్రమాలను, అరాచకాలను ప్రశ్నిస్తున్నారనే అక్కసుతో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి తదితర ఛానళ్లపై గత వైసిపి ప్రభుత్వం విధించిన నిషేధాన్ని.. కొత్త ప్రభుత్వం తొలగించింది.మూడు ఛానల్స్‌పై గత అసెంబ్లీ విధించిన నిషేధాన్ని స్పీకర్ అయ్యన్న పాత్రుడు తొలగించారు. ఇందుకు సంబంధించిన ఫైల్‌పైనే అయ్యన్న తొలి సంతకం చేశారు. అసెంబ్లీలో స్పీకర్ ఛాంబర్‌లో పూజలు నిర్వహించిన అయ్యన్నపాత్రుడు సభాపతిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం తొలి సంతకం.. ఆయా ఛానల్స్‌పై విధించిన నిషేధాన్ని తొలగిస్తూ రూపొందించిన ఫైల్‌పై పెట్టారు. గత ప్రభుత్వ హయాంలో అసెంబ్లీలో కొన్ని ఛానల్స్‌కి అనుమతి నిరాకరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వులను కొట్టేస్తూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తొలి సంతకం చేశారు. ఛానెల్ ప్రతినిధులు సభలోకి రావొద్దనే పిచ్చి నిర్ణయం ఎవరు తీసుకున్నారంటూ అసెంబ్లీ కార్యదర్శిని స్పీకర్ అయ్యన్న నిలదీశారు. అంతకు ముందు ఛానళ్లపై ఉన్న ఆంక్షలు తొలగించాలంటూ టీడీపీ సీనియర్ నేత దూళిపాళ్ల నరేంద్ర స్పీకర్‌కు లేఖ ఇచ్చారు. ఈ లేఖను పరిశీలించిన స్పీకర్.. తక్షణమే ఆంక్షలు సడలిస్తూ తొలిసంతకం చేశారు.

విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, టివి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.

పెరుమాళ్ళ వర ప్రసాద్

సంప్రదించవలసిన నంబర్లు

94916 28386 85220 22029

Land Line No : 08517 224194

కర్నూలు సంపుటి : 04 సంచిక : 51 ఆదివారం 23-06-2024 పేజీలు :04 వెల:రూ.2.00

అయ్యన్న ఎంపికతో సభకు హుందాతనం

అమరావతి,జూన్22: ఎపి శాసనసభ సమావేశాలు రెండోరోజు శనివారం స్పీకర్ ఎన్నికతో ప్రారంభం అయ్యాయి. స్పీకర్‌గా అయ్యన్న పాత్రుడి ఎన్నికను సభ్యులు అభినందించారు. ఆయన స్పీకర్‌గా ఇక సభను హుందాగా నడిపించాలని, గౌరవసభ ముందుకు తీసుకుని వెళ్లాలని ఆకాంక్షించారు. ఈ క్రమంలో సిఎం చంద్రబాబు తొలుత మాట్లాడుతూ...అసెంబ్లీలో అత్యంత సీనియర్ సభ్యుల్లో అయ్యన్న పాత్రుడు ఒకరని అన్నారు. స్పీకర్‌గా అయ్యన్న ఎన్నిక అనంతరం ఆయన మాట్లాడారు. అందరి ఆమోదంతో ఏకగ్రీవంగా ఎన్నిక కావడం సంతోషమన్నారు. ఎన్టీఆర్ పిలుపుతో 25 ఏళ్ల వయసులో అయ్యన్నపాత్రుడు రాజకీయాల్లోకి వచ్చారని తెలిపారు. 7 సార్లు ఎమ్మెల్యే, ఒకసారి ఎంపీగా ఎన్నికయ్యారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రిగా తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక ముద్ర వేశారని కొనియాడారు. ఏ పదవి ఇచ్చినా వన్నె తెచ్చారని పేర్కొన్నారు. 66 ఏళ్ల వయసు ఉన్నా అయ్యన్న ఇప్పటికీ ఫైర్ బ్రాండే. నీతి, నిజాయతీ, నిబద్ధతను పుణికి పుచ్చుకొని రాజకీయాలు చేశారు. గత ఐదేళ్లుగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

సుదీర్ఘ రాజకీయ అనుభవంతో ప్రత్యేక ముద్ర
గౌరవసభగా ఇక మంచి నిర్ణయాలకు ఆస్కారం
రాజధాని, పోలవరం, నదుల అనుసంధానం జరగాలి
అయ్యన్న నేతృత్వంలో సభలో మంచి నిర్ణయాలు తీసుకోవాలి
స్పీకర్‌ను అభినందిస్తూ సిఎం చంద్రబాబు ప్రసంగం

ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. ఆయనపై అనేక పోలీసు స్టేషన్లలో కేసులు పెట్టి వేధించారు. 23 కేసులు పెట్టినా రాజీలేని పోరాటం చేశారు. ఆయన చట్టసభకు రావడం అరుదైన గౌరవం. మనందరిపై పవిత్ర బాధ్యత ఉందని గుర్తుంచుకోవాలి. సమర్థంగా పనిచేస్తే గౌరవం దానంతట అదే వస్తుందని బాబు అన్నారు. ఎంతో పవిత్రమైన అసెంబ్లీని గత ప్రభుత్వం దెబ్బ తీసింది. 23 మంది గెలిచి అసెంబ్లీకి వస్తే చాలా ఇబ్బంది పెట్టారు. నా కుటుంబం గురించి ఇష్టానుసారం మాట్లాడారు. మైకు ఇవ్వకుండా చేసి అవమానపరిచారు. సీఎంగానే అసెంబ్లీకి వస్తానని ఆరోజే గట్టిగా చెప్పా. కౌరవ సభకు రాను.. గౌరవ సభకే వస్తానని స్పష్టం చేశా. రాష్ట్రంలోని ఆడపడుచులను అవమానించారు. సోషల్‌మీడియాలో ఇష్టానుసారం పోస్టులు పెట్టారు. ప్రజలు అంతా గమనించి నన్ను గౌరవసభకు పంపారు. భవిష్యత్తులో ఏ ఆడబిడ్డకు అవమానం జరగకుండా చూడాలి. నా గౌరవాన్ని కాపాడిన ప్రజానీకానికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. మరో జన్మ ఉంటే తెలుగువాడిగానే పుట్టాలి. తెలుగు గడ్డ రుణం తీర్చుకోవాలనేదే నా కోరికని అన్నారు. ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో సీఎం హోదాలో చంద్రబాబు తొలిసారి శనివారం ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఎక్కడ తగ్గాలో.. ఎక్కడ నెగ్గాలో తెలిసిన వ్యక్తి పవన్ అని ప్రశంసల జల్లు కురిపించారు. పవన్‌ను అసెంబ్లీ గేటు తాకనీయబోమన్నారని, కానీ పవన్ పోటీ చేసిన 21 చోట్ల గెలిచారని చంద్రబాబు అన్నారు. ఆనాడు 23 సీట్లు వస్తే దేవుడు రాసిన స్క్రిప్ట్ అని హేళన చేశారు. నేడు కూటమికి 164 సీట్లు వచ్చాయి.. ఇది దేవుడు రాసిన స్క్రిప్ట్. పవన్‌ను అసెంబ్లీ గేటు కూడా తాకనీయమని విమర్శించారు. పోటీ చేసిన 21 స్థానాల్లో పార్టీని గెలిపించిన వ్యక్తి పవన్. ఎక్కడ తగ్గాలో .. ఎక్కడ గెలవాలో తెలిసిన వ్యక్తి పవన్. వైకాపా వైనాట్ 175 అని చెప్పి 11 సీట్లు తెచ్చుకున్న పరిస్థితిని చూశాం. గత ఐదేళ్ల తాను ఎంతో బాధపడ్డానని అన్నారు. గత ఐదేళ్లుగా శాసనసభలో జరిగిన సంఘటనలు చూసి బాధపడ్డానని అన్నారు.గత సభలో అసెంబ్లీని వాకౌట్ చేసేటప్పుడు చేసిన ప్రకటనను ఈ సందర్భంగా చంద్రబాబు గుర్తు చేశారు. కౌరవ సభలో తాను ఉండబోనని, సీఎంగానే సభలో అడుగుపెడతానని చెప్పానని గుర్తుచేశారు. తన కుటుంబ సభ్యులపై వైసీపీ సభ్యులు అమర్యాదగా మాట్లాడారని చంద్రబాబు గుర్తుచేశారు. వైసీపీ పాలనలో ఎంతోమంది మహిళలు బాధపడ్డారని, గౌరవసభగా శాసనసభను నడిపిస్తానని ప్రజలకు మాట ఇచ్చానని, రాష్ట్రంలో ఆడబిడ్డలకు వైసీపీ పాలనలో జరిగిన అవమానం ఇంకెప్పుడూ ఈ సభలో జరగకూడదని చంద్రబాబు



అన్నారు. అవతలి పార్టీ సభ్యులను ఎగతాళి చేయాల్సిన అవసరం లేదని చంద్రబాబు అన్నారు. వైసీపీ సభ్యులను సభలో గౌరవించాలని అన్నారు. ఈ సభలో హుందాతనంతో ముందుకు వెళ్లాలని, వెకిలితనం, వెకిలి మాటలకు ఇక స్వస్తి అని చంద్రబాబు స్పష్టం చేశారు. చట్ట సభలు విలువ తెలిసిన వ్యక్తి అయ్యన్న పాత్రుడని, ఆయన నాయకత్వంలో సభ హుందాతనం పెరుగుతుందని ఆశిస్తున్నట్టు చంద్రబాబు విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్రం అభివృద్ధి విషయానికి వస్తే రాజధాని కట్టాలని, అలాగే పోలవరం నిర్మాణంతో పాటు నదుల అనుసంధానం, పేదల అభివృద్ధి వంటి కార్యక్రమాలు ఈ సభలోనే చేపట్టాలని చంద్రబాబు ఆకాంక్షించారు.'నేను శాసనసభలో సీనియర్ సభ్యుడిని. మొత్తం 16 సభలు జరగ్గా 9 సభల్లో ఉన్నాను. 9 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాను. నా జీవితంలో 15వ శాసనసభలో జరిగినట్లు ఎప్పుడూ జరగలేదు. సభ గౌరవాన్ని పెంచేలా సభ్యులు వ్యవహరించాలి. అయ్యన్నపాత్రుడు నేతృత్వంలో సభ హుందాగా నడుస్తుందనే నమ్మకం ఉంది. రాజ్యాంగ స్ఫూర్తిని అయ్యన్న కాపాడతారు' అని చంద్రబాబు అన్నారు.

రాష్ట్ర ప్రజలు మీ హుందాతనం చూస్తారు

ఈ ఐదేళ్లు..వచ్చే భవిష్యత్‌కు పునాది కావాలి
అయ్యన్నను అభినందిస్తూ ప్రసంగించిన పవన్

అమరావతి,జూన్22: సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న వ్యక్తి స్పీకర్‌గా రావడం సంతోషం అని స్పీకర్ అయ్యన్న పాత్రుడిని డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ అభినందించారు. ఇన్ని దశాబ్దాల్లో ప్రజలు మీ వాడివేడి చూశారు. ఇన్నాళ్లూ ప్రజలు మీ వాగ్దాటి చూశారు. ఇవాళ్టి నుంచి రాష్ట్ర ప్రజలు మీ హుందాతనం చూస్తారు. గత ప్రభుత్వం వ్యక్తిగత దూషణలతో రాష్ట్ర పురోభివృద్ధిని ఆపేసింది. భాష మనసులను కలపడానికే.. విడగొట్టడానికి కాదు. ఎంత జఠిల సమస్య అయినా చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చు అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు.ఇన్నాళ్లు మీ వాడి వేడితో కూడిన మాటలు విన్నాం.. ఇక మీ నుండి అలాంటి మాటలు లేకపోయినా బాధ్యతతో మార్గం చూపించే మాటలు వింటాం. 2047 నాటికి ఏపీ ఉన్నతంగా వుండాలి అంటే ఇప్పుడే దానికి పునాది వెయ్యాలి. విభేదించడం, వాదించడం చర్చకు మూల సిద్ధాంతాలు. అంతేగాని, దూషణలు, కొట్లాటలు కాదు. పొట్టి శ్రీరాములు చావుకు దగ్గర అవుతూ చేసిన ఒక్కో రోజు దీక్ష ఒకటిన్నర ఏళ్లకు సమానం. మహానుభావుడు, బ్రతికినప్పుడే కాదు చనిపోయి నప్పుడు కూడా అయన గుర్తుండాలి. ఈ విలువైన ఐదేళ్లు రాబోయే తరాలకు దిశా నిర్దేశం చేసేలా వుండాలి. పశువు, పక్షి, చెట్టు అన్నీ కూడా బావుండాలి అని కోరుకుంటూన్నాను.' అని పవన్ ఆకాంక్షించారు. డిప్యూటీ సీఎం, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ తొలిసారిగా అసెంబ్లీలో మాట్లాడారు. స్పీకర్‌గా అయ్యన్న పాత్రుడు ఎన్నికైన వేళ పవన్ మాట్లాడారు. రిషికొండను గుండు కొట్టినట్లు ప్రత్యర్థులను విమర్శలతో గుండు కొట్టే సత్తా అయ్యన్నకు ఉంది. ఇకపై ప్రత్యర్థులను విమర్శించే అవకాశం ఆయనకు ఉండదు. కానీ అలా విమర్శలు చేసే వారిని వారించే బాధ్యత ఆయనకు ఉందన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న వ్యక్తి స్పీకర్‌గా రావడం సంతోషంగా ఉందన్నారు పవన్ కల్యాణ్. ఓటమిని ధైర్యంగా స్వీకరించే దమ్ము వైసీపీకి లేదన్నారు. అందుకే సభ నుంచి పారిపోయారని ఎద్దేవా చేశారు. ఇన్ని దశాబ్దాల్లో ప్రజల అయ్యన్న పాత్రుడిలో వాడీవేడి చూశారు ఇన్నాళ్లూ ఘాటైన వాగ్దాటి చూశారని అన్నారు. నేటి నుంచి రాష్ట్ర ప్రజలు మీ హుందాతనం చూస్తారని అయ్యన్నను ఉద్దేశించి కామెంట్ చేశారు.

స్పీకర్‌గా అయ్యన్న పాత్రుడు ఎన్నిక

అమరావతి,జూన్22: నవ్యాంధ్రప్రదేశ్ 3వ శాసనసభా సభాపతిగా చింతకాయల అయ్యన్న పాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయ్యన్న పేరును ప్రొటెం స్పీకర్ బుచ్చయ్య చౌదరి ప్రకటించారు. నూతన స్పీకర్‌గా అయ్యన్న బాధ్యతలు స్వీకరించారు. ఆయనను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ పక్షనేతలు సత్యకుమార్ తదితరులు గౌరవప్రదంగా సభాపతి స్థానంలో కూర్చోబెట్టారు. ఈ కార్యక్రమానికి వైసీపీ అధినేత జగన్ దూరంగా ఉన్నారు. అనకాపల్లి జిల్లా, నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా అయ్యన్నపాత్రుడు ఎన్నికయ్యారు. ఆయనకు నాలుగు దశాబ్దాలకుపైగా రాజకీయ అనుభవం ఉంది. 1983లో తెలుగుదేశం ఆవిర్భావంతో రాజకీయాల్లోకి అయ్యన్నపాత్రుడు ప్రవేశించారు. అప్పటి నుంచి పార్టీకి అన్ని విధాలుగా అండగా నిలిచారు. ఏడుసార్లు ఎమ్మెల్యే గా.. ఒకసారి

స్పీకర్ స్థానంలో కూర్చోబెట్టిన సిఎం, డిప్యూటీ సిఎం

ఎంపీగా అయ్యన్నపాత్రుడు విజయం సాధించారు. పట్టభద్రుడైన అయ్యన్నపాత్రుడు ఇప్పటి వరకూ అయిదు సార్లు మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. సాంకేతిక విద్య, క్రీడా, రహదారులు భవనాలు, అటవీ, పంచాయతీ రాజ్ వంటి కీలక శాఖల బాధ్యతలు నిర్వర్తించారు. 1983 నుంచి ఇప్పటివరకూ 10 సార్లు అసెంబ్లీ ఎన్నికల్లో, 2 సార్లు పార్లమెంట్ ఎన్నికల్లో అయ్యన్న పాత్రుడు పోటీ చేశారు.

శ్రీవారి ప్రత్యేక దర్శనం, లడ్డూ ధరలు యధాతథం

వాటిలో ఎలాంటి మార్పూ లేదని టిటిడి వివరణ
సోసల్ మీడియా ప్రచారంలో వాస్తవం లేదని వెల్లడి

తిరుమల,జూన్22: శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శనం, లడ్డూ ధరలను సవరించినట్లు పలు సామాజిక మాధ్యమాల్లో జరుగుతన్న ప్రచారంలో నిజం లేదని టిటిడి తెలిపింది. ఇవి నమ్మదగినివి కాదని పేర్కొంది. దీనిపై తిరుమల తిరుపతి దేవస్థానం టీడీపీ స్పష్టత ఇచ్చింది. పలు సామాజిక మాధ్యమాలలో శ్రీవారి లడ్డు ధరలు, ప్రత్యేక ప్రవేశ దర్శనం ధరల్లో మార్పులు చేసినట్లు వస్తున్న వార్తలు అవాస్తవమని టీటీడీ స్పష్టంచేసింది. శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, రూ. 50 లడ్డూ ప్రసాదం ధరల్లో ఎటువంటి మార్పు లేదని టీటీడీ స్పష్టం చేసింది. దీనిని 200కు లడ్డూ ధరను 20కి మార్చినట్లు జరుతున్న ప్రచారం అవాస్తవమని పేర్కొంది. ఈ విషయంలో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని నమ్మొద్దని టీటీడీ శనివారంనాడు విడుదల చేసిన ఓ పత్రికా ప్రకటనలో కోరింది. కొన్ని వాట్సఅప్ గ్రూపులలో తిరుమల దర్శనానికి సంబంధించి అధిక ధరలకు ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు పొంద వచ్చునని కొంతమంది వారి ఫోన్ నంబర్లతో కూడిన సమాచారం సర్కులేట్ అవుతుండటం తమ దృష్టికి వచ్చినట్లు టీటీడీ ఓ ప్రకటనలో వెల్లడించింది. వాస్తవానికి శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శనానికి సంబంధించి టీటీడీ వెబ్‌సైట్ ద్వారానే కాకుండా వివిధ రాష్ట్రాలకు సంబంధించిన టూరిజం విభాగాలకు కొంత టికెట్ల కేటాయింపు జరిగినట్లు తెలిపింది.

కొత్తగా 40వేల 336 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు

తొలి ఫైలుపై సంతకం చేసిన మంత్రి గొట్టిపాటి
వేదపండితుల ఆశీర్వచనం మధ్య బాధ్యతలు స్వీకరణ

అమరావతి,జూన్22: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 40వేల 336 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తూ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలు ఇచ్చారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లపై మంత్రి గొట్టిపాటి రవి తొలి సంతకం చేశారు. రాష్ట్ర సచివాలయంలో శనివారం ఆయన వేద పండితుల ఆశీర్వచనాల మధ్య ఏపీ విద్యుత్, ఇంధనశాఖల మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ మొత్తం మూడు ఫైళ్లపై సంతకాలు చేశారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే 40వేల 336 కొత్త వ్యవసాయ విద్యుత్ కనక్షన్లు మంజూరు చేస్తూ తొలి సంతకం చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆఫీసులకు దశలవారీగా సోలార్ విద్యుత్ కనెక్షన్ల మంజూరు చేస్తూ రెండో సంతకం చేశారు. అనంతరం ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో ఇంటింటికి 3 కిలోవాట్ల సోలార్ విద్యుత్ అందించడానికి సంబంధించిన దస్త్రంపై మూడో సంతకం చేశారు. అనంతరం మంత్రి గొట్టిపాటి రవికుమార్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలకు సేవ చేసేందుకు, తనకు విద్యుత్ శాఖ మంత్రిగా అవకాశం ఇచ్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు అందించిన బాధ్యతలు సక్రమంగా నిర్వహించి, ఏపీలో ప్రజలకు మెరుగైన రీతిలో విద్యుత్ అందించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. దేశంలో విద్యుత్ సంస్కరణలకు ఆద్యుడు చంద్రబాబు అని, టీడీపీ హయాంలో ఆయన తీసుకు వచ్చినన్ని విద్యుత్ సంస్కరణలు మరెవరూ తీసుకురాలేదని గొట్టిపాటి రవికుమార్ అన్నారు. దేశంలోనే ఉత్తమ విద్యుత్ శాఖగా ఏపీ రాష్ట్ర విద్యుత్ శాఖను తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం విద్యుత్ శాఖను నిర్వీర్యం చేయడంతో పాటు వారి హయాంలో ఏకంగా 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై మోయలేని భారం మోపారని ఆరోపించారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో కలిసికట్టుగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మంత్రి రవి కుమార్ ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి అవసరాన్నిబట్టి విద్యుత్తు చార్జీలపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

ముగిసిన ఎపి అసెంబ్లీ సమావేశాలు

రెండోరోజు స్పీకర్‌గా అయ్యన్న ఎంపిక
మంత్రి లోకేశ్‌తో కేంద్రమంత్రి రామ్మోహన్ భేటీ
పెండింగ్ విమానాశ్రయాలపై ఇరు నేతల చర్చ

అమరావతి,జూన్2: రెండ్రోజులపాటు జరిగిన ఏపీ అసెంబ్లీ సమావేశాలు శనివారంతో ముగిశాయి. రెండు రోజుల పాటు జరిగిన 16వ శాసనసభ సమావేశాలు ముగిశాయి. తొలి రోజు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, వైసీపీ అధినేత వైఎస్ జగన్ సహా ఇతర ఎమ్మెల్యేలతో ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రమాణ స్వీకారం చేయించారు. రెండో రోజు స్పీకర్‌గా టీడీపీ ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్న పాత్రుడు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు ఏపీ సభాధ్యక్షులు గా ఎన్నికైన అయ్యన్నకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం ఏపీ అసెంబ్లీని నిరవధిక వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ అయ్యన్న పాత్రుడు ప్రకటించారు. కాగా రెండో రోజు సమావేశాలకు వైసీపీ సభ్యులు దూరంగా ఉన్నారు. ఇకపోతే శనివారం రోజున కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఏపీ అసెంబ్లీకి విచ్చేశారు. అసెంబ్లీ లాబీలో ఏపీ మంత్రి నారా లోకేష్‌ను ఆయన కలిశారు. టీడీపీ యువనేతలు ఇరువురు ఆత్మీయ ఆలింగనం చేసుకుని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం కాసేపు మాట్లాడుకున్నారు. రాష్ట్రంలోని పెండింగ్ విమానాశ్రయాలపై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడ్ని లోకేష్ ఆరా తీశారు. పెండింగ్ విమానాశ్రయాలను రెండేళ్ల లోపు పూర్తి చేస్తామని రామ్మోహన్ నాయుడు బదులిచ్చారు. వీలైనంత త్వరగా పూర్తి చేయాలని రామ్మోహన్ నాయుడ్ని లోకేష్ కోరారు.

సంపాదకీయం

ఆదివారం 23-06-2024

పార్టీ నిర్మాణంలో లోపమే కొంప ముంచుతుందా...

తెలుగు రాష్ట్రాల్లో ప్రతిపక్ష పార్టీల పరిస్థితి రోజు రోజుకు దారుణంగా తయారవుతోంది. ప్రతిపక్షానికే పరిమితమైన కొంతమంది ఎమ్మెల్యేలు అధికార పార్టీలోకి కారణాలు, దారులు వెతుక్కుంటారు. గతంలో అధికారం అనుభవించిన పార్టీలను తిట్టి ప్రస్తుతం అధికారంలో ఉన్న పార్టీల్లోకి జంప్ అయిపోతారు. వైసీపీ, బీఆర్ఎస్ విషయంలో కూడా పరిస్థితి అలాగే ఉంది. ఒకరిద్దరు సహజంగా పార్టీలు మారుతారు. బీఆర్ఎస్ నుంచి ఇప్పటి వరకు ఆరుగురు మాత్రమే పార్టీని వీడారు. మిగిలిన వారంతా కేసీఆర్ తోనే ఉన్నారు. ఇక వైసీపీ విషయానికి వచ్చినట్టు అయితే.. ఇంకా ఫిరాయింపులు మొదలుకాలేదు. అంటే.. పరిస్థితులు మరీ చేతులు దాటిపోయేలా లేవు. కానీ.. బీఆర్ఎస్, వైసీపీ భవిష్యత్ పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దానికి కారణం పార్టీ ఫిరాయింపులో, నేతలు కండువాలు మార్చేస్తారనో కాదు. ఆ పార్టీల అధినేతలు పార్టీ నిర్మాణం విషయంలో చేసిన పొరపాట్లు. గెలుపు, ఓటములతో సంబంధం లేకుండా పార్టీ బలంగా ఉండేలా కేసీఆర్, జగన్ పార్టీలను నిర్మించలేదు. కేవలం అధికారంలో ఉన్నపుడు హంగులు మాత్రమే అద్దారు. ఇప్పుడు అధికారం పోయిన తర్వాత ఆ హంగులన్ని రాలిపోతున్నాయి. తెలంగాణ సెంటిమెంట్‌తో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్.. టీడీపీ, కాంగ్రెస్ శ్రేణులను పార్టీలో చేర్చుకుంది. 2014 కంటే ముందు కొన్ని జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి కనీసం బలం లేదు. అలాంటి దగ్గర టీడీపీ నేతలతో ఆ గ్యాప్ నింపుకుంది. అంటే ఇతర పార్టీ నాయకులను తమలో కలుపుకుందే తప్పా.. సొంతగా పార్టీ క్యాడర్ ను తయారు చేసుకోలేదు. బీఆర్ఎస్ అధికారంలో ఉంది కాబట్టి.. ఆ నేతలు కూడా కేసీఆర్ తో కలిశారు. ఇప్పుడు అధికారం కోల్పోయింది కాబట్టి వాళ్లంతా పక్కచూపులు చూస్తున్నారు. ఇక ఏపీలో వైసీపీ విషయానికి వచ్చినట్టు అయితే.. రాష్ట్ర విభజన తర్వాత కాంగ్రెస్ నేతలకు వైసీపీ ఓ వేదికగా కనిపించింది. జగన్ కూడా ఇదే మంచి అవకాశంగా భావించి వచ్చినవారికి వైసీపీ కండువా కప్పేశారు. పార్టీ నిర్మాణం అయిపోయిందని అనుకున్నారే తప్పా.. ఇదే భవిష్యత్‌లో తనకు ప్రమాదంగా మారుతందని అంచనా వేయలేదు. రేపటి రోజున ఏపీలో కాంగ్రెస్ బలపడుతుందని కొంచెం నమ్మకం కలిగినా.. వైసీపీ నేతలంతా హస్తం గూటికి చేరిపోవడం ఖాయం. ఇప్పటికే అదే అభిప్రాయంలో చాలా మంది ఉన్నారు. ఇక టీడీపీ విషయానికి వచ్చినట్టు అయితే.. వైసీపీ, బీఆర్ఎస్ కు పూర్తి భిన్నంగా ఉంటుంది. టీడీపీని చంద్రబాబు బలంగా నిర్మించారు. అందుకే.. 70శాతానికి మించి టీడీపీ ఎమ్మెల్యేల రాజకీయ ప్రస్థానం ఆ పార్టీ నుంచి మొదలవుతుంది. అంటే.. టీడీపీ స్కూల్‌లోనే వాళ్లు ఓనమాలు దిద్దారు. అలాంటి వారు ఒకరిద్దరు పార్టీని వీడి వెళ్లిపోయినా.. మెజారిటీ నేతలు ఉంటారు. అందుకే.. 2004, 2009లో ఓడిపోయినా మళ్లీ 2014లో టీడీపీ గెలిచింది. 2019లో ఓడిపోయినా 2024లో మళ్లీ గెలిచింది. ఎందుకంటే సహజంగానే ప్రాంతీయ పార్టీల్లో నాయకుడే సర్వస్వంగా ఉంటుంది. అందుకు తగ్గట్టుగానే వైఎస్ జగన్ అనే నాయకుడే ఆ పార్టీకి జెండా, ఎజెండా అన్నట్టుగా ప్రజల్లో ప్రచారం కూడా సాగుతుందిసామాన్య జనం కూడా జగన్‌ని గమనంలో ఉంచుకుని మాత్రమే ఆయన పార్టీ గుర్తు ఫ్యాన్‌కు ఓట్లు వేసిన సంగతిని అంతా అంగీకరిస్తారు. వైసీపీ నాయకులు కూడా జగన్‌ను జనం ఆదరించడం వల్లనే తాము గెలిచామని పలు సందర్భాల్లో చెప్పడం గమనార్హం. “ఒక రాజకీయ పార్టీగా వ్యవహరించలేకపోతున్నాయి. గతంలో ఎవరు అధికారంలో ఉన్నా ప్రభుత్వం, పార్టీ రెండు కన్నుల్లా ఉండేవి. ఇప్పుడు పూర్తిగా ప్రభుత్వ వ్యవహారాలకే పరిమితమయ్యారు. ఇలాంటి సమయంలో పార్టీ నిర్మాణం మీద, కార్యకలాపాల మీద దృష్టి కనిపించడం లేదు. ఎన్టీఆర్ మాదిరిగానే జగన్‌కు కూడా సొంత ఛరిష్మా ద్వారా అధికారం దక్కినా ఎన్టీఆర్ తరహాలో ఓ యంత్రాంగాన్ని జగన్ సిద్ధం చేసుకోలేకపోయారని అభిప్రాయపడ్డారు. ముగ్గురు, నలుగురు మినహా పాలన, పార్టీ వ్యవహారాలను చక్కదిద్దే వారే కనిపించని స్థితి తెచ్చుకున్నారని ఆయన చెప్పుకొచ్చారు. కరోనా సహా వివిధ కారణాలతో గడిచిన మూడేళ్లుగా స్థానిక ఎన్నికలు మినహా పార్టీల రాజకీయ కార్యాచరణ పెద్దగా కనిపించలేదు. తాజాగా ఇటీవల నియోజకవర్గ ప్లీనరీలు, జిల్లా స్థాయి ప్లీనరీలతో సమావేశాలు నిర్వహించారు. ఆయా సమావేశాల్లో పలువురు తమ అసంతృప్తిని వెళ్లగక్కారు. ఎమ్మెల్యేలు సైతం కార్యకర్తల సమస్యల గురించి వాపోవాల్సి వచ్చింది. పార్టీ నిబంధనావళిలో కూడా కొన్ని మార్పులకు సిద్ధమయ్యారు. కింజరాపు ఫ్యామిలీ, విజయనగరం రాజులు లాంటి వారు, అయ్యన్న పాత్రుడు, గోరంట్ల బచ్చయ్య చౌదరి ఇలాంటి వారంతా టీడీపీలోనే రాజకీయ ప్రస్థానాన్ని మొదలు పెట్టారు. అందుకే అంత ఈజీగా పార్టీ మారరు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుకు ఎన్ని ప్రలోభాలు ఎదురైనా టీడీపీతోనే ఉంటారు. ఎందుకంటే వారి పుట్టుక అక్కడే మొదలైంది. పార్టీ నిర్మాణం బలంగా ఉంటే.. నేతలు అంటిపెట్టుకొని ఉంటారు. కానీ, బీఆర్ఎస్, వైసీపీ మాత్రం ఇతర పార్టీల నుంచి నాయకులను ఇంపోర్టు చేసుకుంది. అధికారం కోసం వచ్చిన నేతలు.. అధికారం పోతే వెళ్లిపోతారు.

రుషికొండ రహస్యాలపై అనుమానాలు

విశాఖపట్టణం, జూన్ 22,విశాఖ పర్యాటక కేంద్రం. రుషికొండ అందాలు చూసేందుకు దేశ విదేశాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చే ముందు వరకు రుషికొండపై హరిత రిసార్ట్స్ ఉండేవి. పాత గదులు 34, కొత్త గదులు 24 కలిపి మొత్తం 58 గదులు ఉండేవి. పర్యాటకులు ఆన్‌లైన్‌లో గదులు బుక్ చేసుకుని అక్కడ బస చేసే వారు. రెస్టారెంట్, సమావేశ మందిరాలు ఉండేవి. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలకు వచ్చినట్టే.. రుషికొండకు కూడా పర్యాటకులు స్వేచ్ఛగా వచ్చి వెళ్లిపోయే వారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన కొన్నాళ్ల తర్వాత పరిస్థితులు మారిపోయాయి. మూడు రాజధానుల అంశం, విశాఖ పరిపాలనా రాజధాని అన్న విషయం తెరపైకి వచ్చిన కొన్ని రోజులకే రుషికొండ నిషిద్ధ ప్రాంతంగా మారిపోయింది. పర్యాటకులే కాదు.. స్థానికులు కూడా అక్కడకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ముందుగా 20 అడుగుల ప్రహరీ గోడ పైకి లేచింది. తర్వాత ఆ పరిసర ప్రాంతాల్లోకి ఎవరినీ వెళ్లనివ్వలేదు. అక్కడ ఏదో జరుగుతోందని తెలుసు కానీ.. ఏం జరుగుతోందో ఎవరికీ తెలియదు. రుషికొండ రహస్యం నిగ్గు తేల్చేందుకు అప్పటి ప్రతిపక్షనేతలు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. పవన్‌కల్యాణ్‌ను విశాఖ దాటి వెళ్లనివ్వలేదు. లోకేశ్, కమ్యూనిస్టు నేతలు ఇలా ఎవరూ రుషికొండ దరిదాపుల్లోకి కూడా వెళ్లలేకపోయారునేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు విరుద్ధంగా కొండను తొలచి నిర్మాణాలు చేపడుతున్నారని? దీనివల్ల మొత్తం రుషికొండకే ప్రమాదం ఏర్పడుతుందని ప్రతిపక్షాలు, పర్యావరణ వేత్తల తరఫున న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. పర్యాటక భవనం పేరుతో దరఖాస్తులు చేసుకుని మరేవో నిర్మాణాలు చేపట్టారన్న మూకుమ్మడి ఆరోపణలు వినిపించాయి. గండికోట రహస్యం తరహాలో? ఇలా నాలుగేళ్లపాటు రుషికొండ రహస్యం సాగింది. ఇంకొన్నేళ్లు ఆ రహస్యం అలాగే ఉండేదేమో కానీ? ఇంతలో ఎన్నికలొచ్చి ప్రభుత్వం మారిపోయింది. భీమిలి ఎమ్మెల్యే గంటాశ్రీనివాసరావు? మరికొందరిని తీసుకుని రుషికొండ రాజప్రాసాదంలో అడుగుపెట్టడంతో అసలు కథ బయటికొచ్చింది. నాలుగేళ్లపాటు సాధారణ జనం మొదలుకుని,



రాజకీయ నేతల దాకా ఎవరినీ రుషికొండ వైపు కన్నెత్తి చూడనీకుండా అప్పటి ప్రభుత్వం ఎందుకు అడ్డుకుందో.. రుషికొండకు సంబంధించిన వ్యవహారాలన్నింటినీ రహస్యంగా ఉంచడానికి కారణమేంటో? రుషికొండను తొలచి ఏం చేశారో అందరికీ తెలిసిపోయింది. కొండ చుట్టూ ఏడు సూపర్ స్ట్రక్చర్స్, సీ వ్యూ క్యాప్చర్.. ఆ భవనాల లోపల విదేశాల నుంచి తెప్పించిన ఇంటీరియర్ ఫర్నీచర్, యూరప్ నుంచి తెప్పించిన గ్రానైట్, ప్రత్యేక డిజైన్ మార్బుల్, బయోమెట్రిక్‌తో పనిచేసే వార్డ్‌రోబ్స్, 500 చదరపు అడుగుల విస్తీర్ణంలో బాత్‌రూమ్‌లు, ఎటువైపు నుంచి చూసినా సముద్రం కనిపించేలా డిజైన్, గోడలపై పాలరాయి తాపడాలు, కళ్లు మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాలు, విదేశాల నుంచి తెప్పించిన మంచం, పరుపు, కుర్చీలు, బల్లలు, భవనాల బయట విదేశాల నుంచి తీసుకొచ్చిన వేల మొక్కలతో ఏర్పాటు చేసిన గార్డెన్, ఆ గార్డెన్‌లో 20 కోట్ల ఖర్చుతో చేసిన విద్యుత్ అలంకరణలు, రెండున్నర లక్షలతో ఏర్పాటైన్ ఒక్కో విద్యుత్ దీపం?. ఇలా రుషికొండపై ఉన్న నిర్మాణాల ధగధగలు గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈ ఏడు బ్లాకుల్లో ఓ భవనంలోని బాత్ టబ్, స్పా, బంగారం రంగులో ఉన్న కమోడ్ గురించి అంతర్జాతీయ స్థాయిలో చర్చ జరుగుతోంది. జగన్ తన కోసం, తన కుటుంబం కోసం నిర్మించుకున్నారని టీడీపీ ప్రభుత్వం ప్రచారం చేస్తున్న ఓ భవనంలో ఇవి ఉన్నాయి. బాత్ టబ్ ఖరీదు 26 లక్షలని, బంగారం రంగులో ఉన్న కమోడ్ ధర 15 లక్షలని ప్రభుత్వం అంటోంది. హరిత రిసార్ట్స్ ఆధ్వర్యంలో నడిచే రూమ్‌లను అధునాతనంగా తీర్చిదిద్దడంతో పాటు కొండపై కొత్త భవనాలు నిర్మించారు. కొత్త నిర్మాణాల్లో నిబంధనలు పాటించలేదని టీడీపీ ఆరోపిస్తోంది. పాత భవనాల ఆధునికీకరణ, కొత్త భవనాల నిర్మాణానికి 500 కోట్లు ఖర్చు పెట్టారని ప్రచారం జరుగుతోంది. మొత్తం 9.88 ఎకరాల్లో విజయనగర, కళింగ, వేంగి, గజపతి బ్లాకులుగా భవనాల నిర్మాణం జరిగింది. విజయనగర బ్లాకునే మూడుగా విభజించారు. వాటికి చోళ, పల్లవి, తూర్పు కనుమలుగా పేర్లు పెట్టారు. ఏపీటీడీసీ ఆధ్వర్యంలో ఈ ఆధునికీకరణ కార్యక్రమాలు సాగాయి. రిసార్టులను ఆధునికీకరించే పనులు మొదలుపెట్టిన దగ్గర నుంచి అసలక్కడ ఏం జరుగుతోందో ఎవరికీ తెలియదు. గంటా శ్రీనివాసరావు ఆ భవనాల వీడియోలు విడుదల చేసేవరకు.. ఆంధ్రప్రదేశ్‌లో అంత విలాస భవనాలు ఉన్న విషయమే బయటకు రాలేదు. 400మందితో సమావేశం జరుపుకోగల మీటింగ్ రూం, 100 మందితో సమావేశాలకు సరిపోయే నాలుగు రూమ్స్ ఉన్నాయి. ఏడు బ్లాకులుగా ఉన్న మూడు భవనాలు అత్యాధునిక హంగులతో ఉన్నాయి. ఖరీదైన ఫర్నీచర్, షాండ్లియర్లు, బంగార రంగు షవర్లు, కుళాయిలు, టీవీలు, అధునాతన డిజైన్లలో ఫ్యాన్లు, బిగ్‌స్క్రీన్‌లు, ఖరీదైన కుర్చీలు, విలాసవంతమైన పడకగదులు ఇలా రుషికొండ రాజభవనాల ప్రత్యేకతల గురించి, ఆ స్థాయిలో ఆ భవనాలను తీర్చిదిద్దడానికి అయిన ఖర్చు గురించి ఎంత చెప్పినా తక్కువే. రుషికొండ ప్యాలెస్‌లో వాడిన ఇటాలియన్ మార్బుల్, టైల్స్ చూస్తే దిమ్మ తిరుగుతుందని, ఈ ఇటాలియన్ మార్బుల్ కోసం ఒక్కో అడుగుకు పెట్టిన ఖర్చుతో మధ్యతరగతి ప్రజలు చిన్న సైజు అపార్ట్‌మెంట్ కొనేయొచ్చని టీడీపీ ఆరోపిస్తోంది. ఆ ఆరోపణల సంగతి పక్కన పెడితే విభజన బాధిత రాష్ట్రంగా, రాజధాని లేని రాష్ట్రంగా మిగిలిపోయిన ఆంధ్రప్రదేశ్.. రాష్ట్రపతి, ప్రధానమంత్రి వంటి పెద్దల కోసం, పర్యాటకుల కోసం ఈ స్థాయిలో ఖర్చు పెట్టి భవనాలు నిర్మించే స్థితిలో ఉండడమే అసలైన విచిత్రం.

వడివడిగా విమానశ్రయ పనులు

విజయనగరం,జూన్ 22, భోగాపురం విమానాశ్రయ పనులు వేగం పుంజుకున్నాయి. భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ ఏపి రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత అంశం. త్వరితగతిన ఎయిర్ పోర్ట్ నిర్మాణం పూర్తి చేసి విమానాలను రన్ వే పై దూసుకుపోయేలా చర్యలు చేపట్టాలని ఇటు నూతన రాష్ట్ర ప్రభుత్వం, అటు కేంద్రం ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. అందుకోసం నిరంతరం పర్యవేక్షిస్తుంది ఎపిఎడిసిఎల్. ఉత్తరాంధ్ర నడిబొడ్డున ఉన్న భోగాపురంలో నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ ఆంధ్రప్రదేశ్ కే తలమానికం. ఇటు విశాఖకు, అటు శ్రీకాకుళం జిల్లాకు మధ్యలో ఉన్న భోగాపురంలో ఎయిర్ పోర్ట్ నిర్మాణం జరిగితే ప్రయాణికుల సౌకర్యంతో పాటు కార్గో కూడా అభివృద్ధి చెందుతుంది. రాష్ట్ర విభజనలో భాగంగా ఏపికి కేటాయించిన కీలక ప్రాజెక్ట్స్‌లో ముఖ్యమైన ప్రాజెక్ట్ భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్.. అలా కేటాయించిన ప్రాజెక్ట్ మూడు జిల్లాలకు అందుబాటులో ఉండేలా చేయాలని అనేక రకాల అధ్యయనం చేసింది అప్పటి రాష్ట్ర ప్రభుత్వం. అన్నివిధాలా పరిశీలించిన తరువాత విశాఖ, శ్రీకాకుళం జిల్లాలకు సమీపంలో విజయనగరం జిల్లా భోగాపురం వద్ద నిర్మించాలని నిర్ణయించింది. 2016లో స్థలం గుర్తించి, ఎయిర్ పోర్ట్ కు నోటిఫికేషన్ ఇచ్చింది ప్రభుత్వం. ఆ తరువాత అనేక అడ్డంకులతో భూసేకరణ పూర్తి చేసి నిర్మాణ పనులను ప్రఖ్యాతి గాంచిన జి ఎమ్ ఆర్ సంస్థకి అప్పగించింది అప్పటి చంద్రబాబు ప్రభుత్వం. భోగాపురం అంతర్జాతీయ ఎయిర్ పోర్ట్ నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల అనుమతులు ఇవ్వడంతో సుమారు 4,750 కోట్ల వ్యయంతో ఎయిర్ పోర్ట్ నిర్మాణంను ప్రారంభించేందుకు సిద్ధమైంది జిఎం ఆర్ సంస్థ. 2023 ఫిబ్రవరి 3న శంఖుస్థాపన చేసి పనులను ప్రారంభించింది జి ఎమ్ ఆర్ సంస్థ. కేవలం మూడేళ్లలోనే ఎయిర్ పోర్ట్ నిర్మాణ పనులు పూర్తి చేసి కార్యకలాపాలు ప్రారంభిస్తామని ఎయిర్ పోర్ట్ నిర్మాణ సంస్థ ప్రారంభించింది. అలా పనులు ప్రారంభం అయిన నత్తనడకన సాగుతుండటంతో పాటు ఎయిర్ పోర్ట్ కు అనుసంధాన సీడ్ యాక్సిస్ రోడ్ల తో పాటు చాలా పనులు ఇంకా ప్రారంభమే కాలేదు. పనులు ఎప్పటికి పూర్తవుతాయో అన్న సందేహం అందరిలో నెలకొంది. అయితే ప్రస్తుతం అదే ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం ఎంపి అయిన రామ్మోహన్ నాయుడు కేంద్ర విమానయాన మంత్రి కావడంతో కొత్త ఆశలు చిగురించాయి. ఎయిర్ పోర్ట్ పనులు

పరుగులు తీయిస్తా, నిర్ణీత సమయంలోనే ఎయిర్ పోర్ట్ నిర్మాణ పనులను పూర్తిచేస్తామని చెప్పడంతో ఉత్తరాంధ్ర వాసులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. అనుకున్నవి అనుకున్నట్లు జరిగితే మరో రెండేళ్లలో ఎయిర్ పోర్ట్ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. భోగాపురం ఎయిర్ పోర్ట్ నిర్మాణం పూర్తయితే ప్రయాణికుల రాకపోకలతో పాటు కార్గో సేవలు కూడా గణనీయంగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. అంతర్జాతీయ విమానాశ్రయం కావటంతో ఇక్కడి నుంచి ఇతర దేశాలకు సైతం రాకపోకలు జరగనున్నాయి.. అంతే కాకుండా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు రావడంతో పాటు పెద్దఎత్తున పెట్టుబడులు వచ్చి వెనుకబడిన ఉత్తరాంధ్ర మూడు జిల్లాలు అభివృద్ధి పథం వైపు దూసుకుపోయే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

రోజుకు 2.14 లక్షల మందికి అన్నదానం

తిరుమల, జూన్ 22,తిరుమల శ్రీవారి దర్శనార్థం విచ్చేసే భక్తులకు మరింత నాణ్యమైన, రుచికరమైన అన్నప్రసాదాలు అందించాలని టీటీడీ ఈవో శ్రీ జె శ్యామల రావు అధికారులను ఆదేశించారు. టీటీడీ అన్నప్రసాద విభాగం కార్యకలాపాలను బుధవారం ఈవో రివ్యూ చేశారు. టీటీడీలోని ప్రతి విభాగం పని తీరుపై తెలుసుకోవడంలో భాగంగా తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలోని సమావేశ మందిరంలో జేఈవోలు గౌతమి, శ్రీ వీరబ్రహ్మంలతో కలిసి అన్నప్రసాద విభాగాన్ని సంబంధిత అధికారులతో కలసి ఈవో సుదీర్ఘంగా సమీక్షించారు. తిరుమలలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం కాంప్లెక్స్(ఎంటీవీఏసీ), విక్యూసీలోని అక్షయ కిచెన్, పీఏసీ 2తో పాటు, ఉద్యోగుల క్యాంటీన్, పద్మావతి అతిథి గృహం సహా తిరుమలలో అన్నప్రసాదాలు తయారు చేసే ప్రదేశాలను ఆయన సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసి, తాత్కాలికంగా నిలిపివేసిన పాంచజన్యం వంటశాలను త్వరగా ప్రారంభించేలా చూడాలని అన్నప్రసాదం, ఇంజినీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. తిరుమల, తిరుపతిలతో కలిపి రోజుకు సగటున 1.92 లక్షల మంది అన్నప్రసాదం స్వీకరిస్తున్నారు. వీరిలో తిరుమలలో అన్నం తినేవారి సంఖ్య దాదాపు 1.75లక్షలు కాగా, తిరుపతిలో 17వేలు మందిగా ఉంది. వారాంతాల్లో తిరుమలలో 1.95 లక్షలు, తిరుపతిలో 19 వేలతో కలిపి సుమారు 2.14 లక్షల మందికి అన్నప్రసాదం స్వీకరిస్తున్నారు. కాగా ఒక రోజున అన్నప్రసాదం కోసం అవుతున్న ఖర్చు దాదాపు రూ.38 లక్షలుగా ఉంది. కాగా భక్తులకు అందజేస్తున్న మజ్జిగలో నాణ్యత పెంచాలని, వంట చేసే స్థలంలో ఆవరణను పరిశుభ్రంగా, పొడిగా ఉంచాలని అధికారులకు ఈఓ సూచించారు. ఆహార పదార్థాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఫుడ్ క్వాలిటీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. రుపతిలో అన్న ప్రసాదం నాణ్యత పై గతంలో చాలా రకాల విమర్శలు ఉన్నాయి. ఇది ఎప్పటికప్పుడు వెలుగు చూసాయి కూడా. ముఖ్యంగా మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నదాన సత్రంలో నాణ్యత పై భక్తులే నిలదీసిన సందర్భాలు కూడా ఉన్నాయి. అన్న ప్రసాదం నాణ్యత పై ఎప్పటికప్పుడు టీటీడీ అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. టిటిడి డైలీ ఈవో, సోషల్ మీడియా వేదికగా కొందరు ఇదే విషయమై తరచూ ప్రస్తావించేవారు. కళ్లకు అద్దుకుని శ్రీవారే అందించినది గా భావించే అన్న ప్రసాదం అధ్వానంగా మారడంతో టీటీడీ చరిత్ర మసకబారింది. అయితే ఈ విషయంలో వైసీపీ నేతలు పెద్దగా పట్టించుకోకపోవడంతో భక్తులు కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ తరుణంలో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ముందుగా తిరుపతి నుంచి ప్రక్షాళన ప్రారంభించారు. సంవత్సరాలుగా టీటీడీ ఇంచార్జ్ ఈవోగా పాతుకుపోయిన ధర్మారెడ్డిని తప్పించారు. సిన్సియర్ అధికారిగా గుర్తింపు పొందిన శ్యామల రావును నియమించారు. ఆయన బాధ్యతలు తీసుకున్న మరుక్షణం నుంచి అన్నప్రసాద నాణ్యత పై దృష్టి పెట్టారు. దీంతో భక్తులకు నాణ్యతతో కూడిన అన్న ప్రసాదం అందుతోంది. టిడిపి ప్రభుత్వాలు తిరుమల తిరుపతి దేవస్థానంలో అన్నప్రసాద నాణ్యతను పెద్దపీట వేసేవి. 1985లో ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చిన తరువాత తిరుపతిలో అన్నప్రసాదశాలలు ఏర్పాటు చేశారు. అవి క్రమేపి విస్తరిస్తూ వచ్చాయి. భక్తుల కడుపు నింపేందుకు ప్రయత్నించేవి. మొత్తానికైతే టిడిపి అధికారంలోకి వచ్చింది. తిరుమలలో భక్తులకు నాణ్యమైన అన్న ప్రసాదం అందుతుందన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. తిరుమల, తిరుపతిలలో పెరుగుతున్న భక్తుల సంఖ్యకు అనుగుణంగా సిబ్బందిని పెంచడం, పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా దశాబ్దాల నాటి యంత్రాల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయడం, అన్నప్రసాదం నాణ్యతను పెంచేందుకు ఫుడ్ కన్సల్టెంట్‌ను నియమించడం వంటి అంశాలకు సంబంధించి వీలైనంత త్వరగా అమలు చేసేందుకు పక్కా కార్యాచరణ ప్రణాళికతో ముందుకు రావాలని సంబంధిత అధికారులను ఈఓ ఆదేశించారు.

ప్రవీణ్ ప్రకాష్ పశ్చాత్తాపం...

విజయవాడ, జూన్ 22,ప్రవీణ్ ప్రకాష్.. జగన్ అస్మదీయ అధికారి. అత్యంత వీర విధేయుడు. జగన్ ముందు వంగి వంగి నమస్కారాలు చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. సీనియారిటీ, సిన్సియారిటీ అధికారిగా పేరు తెచ్చుకున్న ఈయన.. గత ఐదేళ్ల వైసిపి పాలనలో మాత్రం ఎన్నెన్నో విమర్శలను మూటగట్టుకున్నారు. ముఖ్యంగా విద్యాశాఖలో అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సిబ్బందిని ఇబ్బంది పెట్టారన్న అపవాదులు మూటగట్టుకున్నారు. ప్రభుత్వ పెద్దలతో అంటగాకినట్లు ఈయనపై ఆరోపణలు ఉన్నాయి. అందుకే చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసిన తర్వాత ఈయనపై వేటు పడింది. సాధారణ పరిపాలన శాఖకు ప్రభుత్వం సరెండర్ చేసింది. అయితే ఇప్పుడు పశ్చాత్తాప పడుతున్నారు ప్రవీణ్ ప్రకాష్. పాఠశాల విద్యాశాఖలో తాను ఎవరిని అవమానించలేదని.. ఎవరికైనా అలా అనిపిస్తే వారికి చేతులు జోడించి ప్రార్థిస్తున్నానని పశ్చాత్తాపం ప్రకటించారు ఆయన. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ ప్రవీణ్ ప్రకాష్ కు అత్యంత ప్రాధాన్యమిస్తూ వచ్చారు. కీలకమైన పాఠశాల విద్యాశాఖ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు. అయితే విద్యాసంస్కరణలో భాగంగా విద్యా శాఖలో ఎన్నెన్నో మార్పులు జరిగాయి. అయితే పూటకో జీవో, ఉత్తర్వులతో విద్యాశాఖ అస్తవ్యస్తంగా మారింది. ప్రతి నెల ఒక జిల్లాను సందర్శించి హడలెత్తించారు ప్రవీణ్ ప్రకాష్. అధికారులపై బదిలీ వేటు వేయడం, చర్యలు తీసుకోవడం, ఉపాధ్యాయులను తప్పు పట్టడం, ఆకస్మిక తనిఖీలు.. ఇలా ఒకటేమిటి చాలా విద్యలు ప్రదర్శించారు ప్రవీణ్ ప్రకాష్. కనీసం విద్యాశాఖ అధికారుల వెర్షన్ కూడా వినేవారు కాదు. అప్పటికప్పుడు కఠిన చర్యలకు ఉపక్రమించేవారు. అయితే ఇదంతా ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా విద్యాశాఖలో అధికారులు, ఉపాధ్యాయులు ప్రభుత్వ వ్యతిరేక వర్గాలుగా ముద్రపడ్డారు. వారిపై ప్రవీణ్ ప్రకాష్ ద్వారా ప్రభుత్వం కక్ష సాధించిందన్న ఆరోపణలు ఉన్నాయి. టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత నలుగురు కీలక అధికారులపై వేటు పడింది. అందులో ప్రవీణ్ ప్రకాష్ ఒకరు. గత ఐదేళ్లుగా ప్రవీణ్ ప్రకాష్ తీరుతో ఇబ్బంది పడిన బాధితులు ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా బయటపడుతున్నారు. తమకు జరిగిన అన్యాయాలను ఏకరువు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రవీణ్ ప్రకాష్ ఒక ప్రత్యేక వీడియో విడుదల చేశారు.’ గత ఏడాదిన్నరలో ఎన్నో నేర్చుకున్నాను. విద్యాశాఖ పురోగతి కోసమే కృషి చేశాను. నేను తనిఖీలతో ఉపాధ్యాయులు, సిబ్బందిని అవమానించాను అంటూ సామాజిక మాధ్యమాల్లో ఎన్నో వచ్చాయి. అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకే అలా మాట్లాడాను. ఎవర్ని అవమానించేందుకు అలా చేయలేదు. ఎవరైనా అలా భావిస్తే చేతులు జోడించి ప్రార్థిస్తున్నాను. దయచేసి వాటిని మనసులో ఉంచుకోకండి. మరో మనిషిని అవమానించే గుణం నాకు లేదు’ అని వీడియోలో స్పష్టం చేశారు. అయితే వైసీపీ సర్కార్లో కీలక అధికారులు చేసిన పుణ్యమా అని ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయి. ముఖ్యంగా విద్యాశాఖకు సంబంధించి ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మారడం వెనుక ప్రవీణ్ ప్రకాష్ చర్యలు ఉన్నాయి. ఆయన తీరుతో విసిగి వేశారి పోయిన వారు ప్రభుత్వ వ్యతిరేకులుగా మారిపోయారు. ఆయన చర్యల పుణ్యమా అని వైసిపి మూల్యం చెల్లించుకుంది. ఇప్పుడు ప్రవీణ్ ప్రకాష్ పశ్చాత్తాపం వ్యక్తం చేసినా.. పార్టీ పరంగా వైసిపికి, వ్యక్తిగతంగా ప్రవీణ్ ప్రకాష్ కు జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

జాడ లేని వాన

ఒంగోలు, జూన్ 22, ఏడాది డేంజర్ బెల్స్ మోగినట్లే కనిపిస్తున్నాయి. ఇంతవరకు వాన జాడలేదు. ఖరీఫ్ ప్రారంభమవుతున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు పడడం లేదు. దీంతో రైతుల్లో ఆందోళన కనిపిస్తోంది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు మూడు రోజులు ముందుగానే ప్రవేశించాయి. ఈనెల 2న వాటి రాక ప్రారంభమైంది. గురువారం నాటికి రాష్ట్రమంతటా విస్తరించాయి. కానీ ఉత్తరాంధ్ర పై అధిక పీడన ద్రోణి ప్రభావం చూపడంతో స్తబ్దుగా ఉండిపోయాయి. రాష్ట్రమంతటా నైరుతి వ్యాపించినా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడం లేదు. ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 7 గంటల నుంచి భానుడు సెగలు కక్కుతున్నాడు.రాష్ట్రవ్యాప్తంగా ఒకటి రెండు ప్రాంతాలు తప్ప వర్షాలు జాడలేదు. చెప్పుకోదగ్గ వానలు పడడం లేదు. పైగా రాష్ట్ర మంత్రుల నిప్పుల కుంపటిని తలపిస్తోంది. వేడి, ఒక్క పోతతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మే నెలలో ఉన్నట్లుగా గరిష్ట ఉష్ణోగ్రతలు పెరగడంతో బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. మరో నాలుగు ఐదు రోజులు ఇదే పరిస్థితి కొనసాగనుంది. రాత్రి ఉష్ణోగ్రతలు కూడా పెరుగుతాయని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అల్పపీడనం కానీ.. ఆవర్తనం కానీ ఏర్పడితేనే వర్షాలు కురిసి.. వాతావరణం చల్లబడుతుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అయితే ఖరీఫ్ సీజన్ కు సంబంధించి అదును దాటుతుండడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఇంకా నారుమడులు కూడా సిద్ధం కాలేదు.ప్రస్తుతం కర్ణాటక, కేరళ తీరాల మీదుగా ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాబోయే మూడు రోజుల్లో తేలికపాటి నుంచి ఓ మాస్టరు వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. పిడుగులతోపాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని కూడా స్పష్టం చేసింది. శుక్రవారం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణాజిల్లాలో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

బిసి సంక్షేమ వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్.సవిత

విజయవాడ,విజయవాడలోని విద్యుత్ కాలనీలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహాలను రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి హాస్టల్లో అందిస్తున్న భోజనం,హాస్టల్లోని మౌలిక సదుపాయాల ఎలా ఉన్నాయో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.హాస్టల్ పరిసరాలను భోజనశాల,వంట గదులను మంత్రి పరిశీలించారు. పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు.భోజనశాల, వంట గదులను ఆధునీకరించాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు.అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రి భోజనం చేశారు.ఆహార పదార్థాల నాణ్యతపైని అరా తీశారు.విద్యార్థులు నిద్రించే రూములు వారు ఉపయోగించే మరుగు దోడ్లు పరిశుభ్రంగా లేకపోవడంతో వార్డెన్ ను మంత్రి సవిత మందలించారు.ఆహార పదార్థాల నాణ్యత, పరిమాణంపై విద్యార్థులను నేరుగా ఆడిగి తెల్సుకున్నారు.విద్యార్థులకు అందించే భోజనం నాణ్యత లేకపోవడంతో పైనా ఆగ్రహం వ్యక్తం చేసారు. పద్ధతి మార్చుకోవాలని వార్డెన్ ను మంత్రి హెచ్చరించారు. అనంతరం విద్యార్థులతో మంత్రి సవిత మాట్లాడుతూ అందరూ బాగా చదువుకుని ఉన్న స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.తదుపరి విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. వసతి గృహంలో ఏ సమస్య ఉన్న నేరుగా తనకు ఫోన్ చేయమని విద్యార్థులకు మంత్రి ఫోన్ నెంబర్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వైకాపా కార్యాలయాన్ని కూల్చివేసిన సీఆర్డీయే

తాడేపల్లితాడేపల్లిలో నిర్మాణంలో ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని సిఆర్డీయే అధికారులు కూల్చివేశారు. ఉదయం 5:30 గంటల సమయంలో కూల్చివేతల ప్రారంభించారు. పొక్లైన్లు, బుల్డోజర్లతో శ్లాబ్కు సిద్ధంగా ఉన్న భవనాన్ని యుద్ధ ప్రాతిపదికన అధికారులు కూల్చి వేస్తున్నారు. కూల్చివేతకు సీఆర్డీయే ప్రిలిమినరీ ప్రొసీడింగ్స్ను సవాల్చేస్తూ శుక్రవారం హైకోర్టును వైయస్సార్సీపీ నేతలు ఆశ్రయించారు. చట్టాన్ని మీరి వ్యవహరించ వద్దని హైకోర్టు ఆదేశించినా వాటిని బేఖాతరు చేస్తూ చర్యలు తీసుకోవడం పై వైయస్సార్సీపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. కేవలం కక్ష సాధింపు కోసమే ఈ చర్యకు పాల్పడతారని, అధికారుల తీరుపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని చెప్పారు.

తాడేపల్లిలో వైసీపీ కార్యాలయం కూల్చివేత

విజయవాడ, జూన్ 22,నిబంధనలకు విరుద్ధంగా ఉందని అమరావతిలోని తాడేపల్లిలో నిర్మాణంలో ఉన్న వైసీపీ కార్యాలయాన్ని సీఆర్డీఏ అధికారులు కూల్చేశారు. శనివారం వేకువ జామున పోలీసుల పహారా మధ్య పడగొట్టేశారు. సీతానగరం వద్ద ఉన్న వైసీపీ కార్యలయాన్ని ఐదు గంటల ప్రాంతంలో ప్రొక్లెయినర్లు, బుల్డోజర్లతో సీఆర్డిఏ అధికారులు కూల్చేశారు. ఇది ఫస్ట్ ఫ్లోర్ శ్లాబ్ వేయడానికి సిద్ధమవుతున్న టైంలో అధికారులు చర్యలు తీసుకున్నారు. నీటిపారుదల శాఖ స్థలంలో భవనం నిర్మించారని అందుకే చర్యలు తీసుకున్నామని అధికారులు చెబుతున్నారు. బోట్ యార్డుగా ఉపయోగించే స్థలాన్ని తాను అధికారంలో ఉన్నప్పుడు పార్టీకి తక్కువ లీజుతో కట్టబెట్టారని అది చట్టవిరుద్ధమనే ఇప్పుడు చర్యలు తీసుకున్నామని అధికార టీడీపీ చెబుతోంది. దీనిపై ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్టు కూడా పేర్కొంటున్నారు. కూల్చే టైంలో అటుగా కార్యకర్తలు వేరే నేతలు రాకుండా పోలీసులు చర్యలు తీసుకున్నా భారీ భద్రత మధ్య కూల్చివేతలు సాగాయి. సీఆర్డీఏ అధికారులు కూల్చే టైంలోనే వైసీపీ హైకోర్టును ఆశ్రయించింది. దీంతో తొందరపాటు చర్యలు వద్దని కోర్టు నుంచి ఆదేశాలు వచ్చాయి. ఇంతలోనే అధికారులు పని పూర్తి చేశారు. దీని?ప వైసీపీ నేతలు మండిపడుతున్నారు. ఇది చంద్రబాబు ఇంటికి సమీపంలో ఉందన్న కారణంతోనే కూల్చేశారని ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని హైకోర్టు దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఐదేళ్ల పాలన ఎలా ఉంటుందో చంద్రబాబు శాంపిల్గా చూపించారని అన్నారు మాజీ సీఎం జగన్. దేశంలోని ప్రజాస్వామ్యులంతా ఈ ఘోరాన్ని ఖండించాలని పిలుపునిచ్చారు. “ఆంధ్రప్రదేశ్లో రాజకీయ కక్షసాధింపు చర్యలకు దిగిన చంద్రబాబు తన దమనకాండను మరోస్థాయికి తీసుకెళ్లారు. ఒక నియంతలా తాడేపల్లిలో దాదాపు పూర్తికావొచ్చిన వైసీపీ కేంద్ర కార్యాలయాన్ని బుల్డోజర్లతో కూల్చివేయించారు. హైకోర్టు ఆదేశాలనూ బేఖాతరు చేశారు. రాష్ట్రంలో చట్టం, న్యాయం పూర్తిగా కనుమరుగైపోయాయి. ఎన్నికల తర్వాత చోటుచేసుకుంటున్న హింసాత్మక ఘటనలతో రక్తాన్ని పారిస్తున్న చంద్రబాబు, ఈ ఘటన ద్వారా ఈ ఐదేళ్లపాటు పాలన ఏవిధంగా ఉండబోతుందనే హింసాత్మక సందేశాన్ని ఇవ్వకనే ఇచ్చారు.

పక్కా ప్లాన్ తో లోకేష్ అడుగులు

గుంటూరు, జూన్ 22, ఏపీ మంత్రి లోకేష్.. జెట్ స్పీడ్ తో పని మొదలు పెట్టేశారు. టీడీపీ గత ప్రభుత్వంలోనూ మంత్రిగా పని చేసినా.. ఇప్పుడు మాత్రం కంప్లీట్ యాక్షన్ ప్లాన్ మార్చేశారు. స్పీడ్ పెంచేశారు. జనానికి మరింత చేరువయ్యేలా నిర్ణయాలు తీసుకుంటున్నారు. బాధ్యతల స్వీకారానికి ముందే రంగంలోకి దిగేశారు. మంగళగిరి నియోజకవర్గం ఏర్పడ్డ 39 ఏళ్లలో అక్కడ టీడీపీకి అసలు విజయమే లేదు. కానీ నారా లోకేష్ రెండో ప్రయత్నంలోనే మంగళగిరిపై టీడీపీ జెండా ఎగరేశారు.తెలుగుదేశం పార్టీకి రికార్డు విజయం సాధించి పెట్టారు. రికార్డు సృష్టించేలా చేశారు. ఎక్కడ కోల్పోయామో అక్కడే గెలవాలి అన్న లక్ష్యంతో పని చేశారు నారా లోకేష్. నిజానికి చంద్రబాబు తనయుడిగా లోకేష్.. టీడీపీకి గట్టి పట్టు ఉండి, కచ్చితంగా గెలిచే చోటును ఏదైనా ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఉంది. కానీ లోకేష్ రూటే సపరేటు. పార్టీ కండీషన్ చాలా టఫ్ గా ఉన్న చోటే నిలబడి గెలిచారు. అనుకున్నది సాధించారు. చివరికి మంగళగిరి ప్రజల హృదయాలను గెలుచుకున్నారు.సంక్షోభాల నుంచి అవకాశాలు సృష్టించడం అలవాటు చేసుకున్న చంద్రబాబునే లోకేష్ స్ఫూర్తిగా తీసుకున్నారు. ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచి ఇదే మార్క్ చూపిస్తున్నారు. వర్క్ లో కచ్చితత్వం పెంచారు. ఏపీకి ఇప్పుడు ఏం అవసరం.. తనకు ఇచ్చిన శాఖల్లో పురోగతి చూపడం ఎలా అన్నది ఏమాత్రం ఆలస్యం చేయకుండా గ్రౌండ్ వర్క్ పూర్తి చేసి పెట్టుకున్నారు. ఓవైపు పాలన, ఇంకోవైపు పార్టీ.. మరోవైపు ప్రత్యర్థి పార్టీని కట్టడి చేయడం ఇవన్నిటినీ బ్యాలెన్స్ చేస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. చుట్టూ డైనమిక్ టీమ్ ను పెట్టుకున్నారు. దూకుడు పెంచారు.నిజానికి లోకేష్ ప్రత్యక్ష ఎన్నికల్లో గెలవకుండా రికమండేషన్ తో మంత్రి అయ్యారని గతంలో వైసీపీ విమర్శించింది. అప్పుడు పని చేసింది కొంత కాలమే అయినా ఐటీ శాఖలో స్పీడ్ పెంచారు. ఇక 2019లో మంగళగిరిలో ఓడిపోయాక నాడు గెలిచిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు విమర్శల తాకిడి మరింత పెంచారు. అన్నిటినీ భరించారు. ఎదుర్కొన్నారు. ఇప్పుడు ఘన విజయంతో అందరి ముందు సగర్వంగా నిలబడ్డారు లోకేష్. అంతే కాదు.. తనను గెలిపించిన మంగళగిరి ప్రజలకు వెంటనే ఉపశమనం కలిగించేలా నిర్ణయాలు తీసుకోవాలనుకున్నారు. అందులో మొదటిది క్యాంప్ ఆఫీస్ లో డే వన్ నుంచి ప్రజా దర్బార్ ఏర్పాటు చేశారు.ఐదేళ్లుగా జనం పాలకుల నుంచి ఏది మిస్సయ్యారో దాన్ని మంత్రి నారా లోకేష్ గ్రహించారు. అందుకే ప్రజాదర్బార్ పేరుతో జనం నుంచి వినతులను స్వయంగా స్వీకరించారు. పరిష్కారంపై భరోసా ఇస్తున్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను ఆయా శాఖల అధికారులకు పంపి నిర్ణీత సమయంలో పరిష్కరించేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటుచేశారు. ఒక రకంగా చెప్పాలంటే ఈ ప్రోగ్రామ్ జనంపై చాలా ఇంపాక్ట్ చూపిస్తోంది. ఇన్నాళ్లకు తమ సమస్యలు వినే నాయకుడు వచ్చాడు అనుకుంటున్నారు జనం. అటు మంత్రి లోకేష్ కూడా.. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు.మంగళగిరి ప్రజల కోసం తమ ఇంటి ద్వారాలు తెరిచే ఉంటాయని ఎన్నికల సమయంలో చెప్పిన మాటను ప్రజాదర్బార్ ద్వారా నిరూపిస్తున్నారు మంత్రి నారా లోకేష్. మంగళగిరిని ఆదర్శ నియోజకవర్గంగా మార్చి తీరుతానంటున్నారు. రెండోసారి మంత్రి అయ్యాక లోకేష్ కు కీలక శాఖలే దక్కాయి. గతంలో చేపట్టిన ఐటీశాఖతో పాటు ఈసారి విద్యాశాఖ కూడా ఇచ్చారు. ఈ రెండూ ఛాలెంజింగ్ పోర్ట్ ఫోలియోసే. అయితే ఈ శాఖల్లో లోకేష్ తొలి రోజు నుంచే తనదైన మార్క్ చూపిస్తున్నారు. ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 100 రోజుల యాక్షన్ ప్లాన్ ప్రకటించారు. రివ్యూ మీటింగ్ లు పెట్టారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ శాఖపై నజర్ పెట్టారు.రాష్ట్రానికి కొత్తగా ఐటీ, ఎలక్ట్రానిక్స్ కంపెనీలు రావడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలి? కంపెనీలకు ఎలాంటి ప్రోత్సాహకాలు ఇవ్వాలన్న అంశాలపై సమీక్షించారు. వీలైంత త్వరగా రిపోర్టులు ఇవ్వాలన్నారు. బెస్ట్ మెథడ్స్ ఎక్కడ అమలవుతున్నాయో పరిశీలించాలన్నారు. విశాఖను ఐటి హబ్గా, తిరుపతిని ఎలక్ట్రానిక్స్ హబ్ గా మార్చాలని లోకేష్ ప్లాన్ చేస్తున్నారు. ఈ రెండు రంగాల్లో ఏపీ టాప్ పొజిషన్లో ఉండాలని ఇప్పటికే అధికారులకు టార్గెట్ పెట్టారు. పెద్ద పెద్ద కంపెనీలు ఏపీ వైపు చూసేలా చర్యలు తీసుకోవాలన్నారు.త్వరలోనే కొత్త ఇన్వెస్టర్ ఫ్రెండ్లీ ఐటీ పాలసీని అమలు చేసేందుకు రెడీ అవుతున్నారు. జగన్ పాలనలో ఉనికి కోల్పోయిన ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖలకు పూర్వవైభవం తెచ్చేలా ఫోకస్ పెంచారు లోకేష్. అటు విద్యాశాఖ మంత్రి బాధ్యతలు కూడా ఉండడంతో ఈ శాఖపై లోకేష్ ఫోకస్ మరింతగా పెంచారు. త్వరలోనే ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు, తల్లి దండ్రులతో భేటీ అయి.. వారి ఆశలు, ఆకాంక్షల ప్రకారం విద్యావ్యవస్థలో వేళ్లానుకున్న సమస్యలకు పరిష్కారం చూపాలని డిసైడ్ అయ్యారు. ఇందుకోసం సరికొత్త ఐడియాతో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రెడీ చేశారు.పేదబిడ్డలకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించడం, అలాగే టీచర్లకు కేవలం చదువుల బాధ్యతలే ఉండేలా చూడాలనుకుంటున్నారు. పాఠశాలల్లో పూర్తిస్థాయి మౌలికవసతుల కల్పన, ఏళ్లతరబడి ఉన్నతవిద్యాశాఖలో పెండింగ్ లో ఉన్న సమస్యలను పరిష్కరించడం, కోర్టుల్లో ఉన్న చిక్కుముడులను తొలగించి ఫ్యాకల్టీ రిక్రూట్ మెంట్ చేయడం, చిన్నారులకు దేశంలోనే నాణ్యమైన స్కూల్ కిట్స్ అందించేలా చెప్పుకుంటూ వెళ్తే ఇలాంటి టాప్ మోస్ట్ ప్రయారిటీలెన్నో లోకేష్ పెట్టుకున్నారు. ఒక విజన్ తో పని చేస్తున్నారు. చెప్పాలంటే యంత్రాంగాన్ని యాక్టివేట్ చేస్తున్నారు.ఏడాదిలోగా పాఠశాలల్లో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆఫీసర్లకు లోకేష్ టార్గెట్ పెట్టారు. మధ్యాహ్న భోజనం రుచిగా, శుచిగా నాణ్యతగా ఉండాలన్నారు. పాఠశాలల్లో పారిశుధ్యం నిర్వహణకు సంబంధించి ఢిల్లీ ప్రభుత్వం ఫాలో అవుతున్న విధానాలు, ఇతర రాష్ట్రాల్లో స్కూల్స్ శానిటేషన్ కు సంబంధించిన విధానాలను స్టడీ చేసి వాటి కంటే మెరుగైన పద్ధతి అమలు చేయాలంటున్నారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేటు పాఠశాలలకు మారిన విద్యార్థుల సంఖ్య, అందుకు కారణాలను విశ్లేషించి రిపోర్ట్ ఇవ్వాలని సమగ్ర శిక్షణ అధికారులను ఆదేశించారు. బడిలో చేరి మధ్యలో మానేసిన జనరల్ డ్రాప్ అవుట్స్ వివరాలు కూడా ఇవ్వాలన్నారు.

గ్రామాల్లో విద్యార్థులకు స్కూల్ ఎంత దూరంలో అందుబాటులో ఉందన్న వివరాలనూ అడిగారు. గత ఐదేళ్లలో మూతపడ్డ స్కూళ్లు, అందుకు కారణాలు తెలుసుకోవాలని ఆర్డర్ వేశారు.దేశంలోనే బెస్ట్ లైబ్రరీ మోడల్ ఎక్కడ ఉందో తెలుసుకుని, సమీక్ష చేసి అందుకు సంబంధించిన నోట్ ను కూడా అందజేయాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. ఇక ఈనెల 15న ఉండవల్లి నివాసంలో ఉన్నత విద్యాశాఖ అధికారులతో సమీక్షించిన సమయంలో.. ప్రభుత్వ కాలేజీల్లో ఇంటర్ విద్యార్థులకు గత వైసిపి ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు ఇవ్వడం ఆపేసిందని తెలుసుకుని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పుస్తకాలు లేకుండా పేదవిద్యార్థులు ఎలా చదువుతారని ఆ సమావేశంలోనే అధికారులను ప్రశ్నించారు.ఈ విద్యా సంవత్సరం నుంచి వెంటనే ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ అందజేయాలని నిర్ణయం తీసుకున్నారు. జులై 15 నాటికి పాఠ్యపుస్తకాలు పంపిణీ పూర్తి చేయాలని లోకేష్ ఆదేశించడంతో ఆఫీసర్లు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ఓవైపు ఇవన్నీ చేస్తూనే.. పూర్తిస్థాయిలో కేంద్ర నిధులను వినియోగించుకునేలా తగిన ప్రణాళికలకు ఆదేశించారు. సో ఓవరాల్ గా బాధ్యతల స్వీకారానికి ముందే తనకు అప్పగించిన శాఖలపై మంత్రి నారా లోకేష్ ఓ విడత కసరత్తు పూర్తి చేసేశారు. ఇక బాధ్యతల స్వీకారం తర్వాత యాక్షన్ ప్లాన్ మరింత స్పీడ్ అవడం ఖాయంగా కనిపిస్తోంది.

అమరావతిపై మాస్టర్ ప్లాన్ రెడీ

విజయవాడ, జూన్ 22, ఒక రాష్ట్ర ఆర్థిక అభివృద్ధిలో రాజధాని అనేది కీలకం. కానీ దురదృష్టవశాత్తు గత ఐదు సంవత్సరాలుగా రాష్ట్రానికి రాజధాని అన్నది లేకుండా పోయింది. రాజకీయ స్వార్థానికి మొగ్గ దశలో ఉన్న అమరావతి సమిధగా మారింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి అమరావతిని చిదిమేసింది. రాజధాని నిర్మాణాలను పాడుబెట్టింది. ఈ పరిస్థితుల్లో చంద్రబాబు అధికారంలోకి వచ్చారు. ఐదేళ్ల చెర వీడిన అమరావతి రాబోయే ఐదేళ్లలో ప్రజా రాజధానిగా అందుబాటులోకి వస్తుందని రాష్ట్ర ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. కీలకమైన నిర్మాణాలను పునః ప్రారంభించాల్సి ఉంటుంది

ఐకానిక్ టవర్స్ : అమరావతిలో ఐకానిక్ టవర్స్ ను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు చంద్రబాబు. ఇప్పటికే చాలా వాటి నిర్మాణం పూర్తయింది. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది నివాసం ఉండేలా వీటిని తీర్చిదిద్దారు. గత ఐదు సంవత్సరాలుగా నిర్లక్ష్యంగా విడిచిపెట్టారు. వాటిని వినియోగం లోకి తేవాల్సిన తక్షణ అవసరం ఇప్పుడు ఏర్పడింది.

కీలక నిర్మాణాలు: టిడిపి ప్రభుత్వ హయాంలో విభాగాధిపతులు, సచివాలయం, శాశ్వత హైకోర్టు భవనాల పునాదులు గత ఐదేళ్లుగా నీటిలో నానుతున్నాయి. ఈ నిర్మాణాల పటిష్టతను సాంకేతిక నిపుణులతో అంచనా వేయించాలి. సవరించిన అంచనాలతో తిరిగి పనులు ప్రారంభించాలి. ఈ ఐదేళ్లలో వీటిని పూర్తయ్యేలా చూడాలి.

పెండింగ్ భూ సేకరణ: రాజధాని నిర్మాణానికి సంబంధించి భూ సేకరణ అంశం పెండింగ్లో ఉంది. రైతులకు కేటాయించిన ప్లాట్లు, వాటికి సంబంధించిన న్యాయపరమైన చిక్కులను సత్వరమే పరిష్కరించాలి. ఆ భూములను సిఆర్డిఏ కు తిరిగి దక్కలు పడేలా చూడాలి. ఏపీ సి ఆర్ డి ఏ చట్టం, పునర్విభజన చట్టం, అమరావతి బృహత్ ప్రణాళిక, కేంద్ర ప్రభుత్వం అమరావతిని రాజధానిగా నోటిఫై చేసేందుకు న్యాయపరమైన చర్యలను ప్రారంభించాలి

రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు : రైతుల రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు ప్రక్రియను తక్షణం పూర్తి చేయాలి. వాటిని అన్ని వస్తువులతో అభివృద్ధి చేయాలి. దీనివల్ల రాజధానిలో నివాసయోగ్యత స్థాయి పెరుగుతుంది. పెండింగ్ ప్లాట్లు, కేటాయించిన ప్లాట్ లలో ఇంకా చేయించాల్సిన రిజిస్ట్రేషన్ లను నిర్దిష్ట కాల పరిమితిలోగా పూర్తి చేయాలి.

సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణం : అమరావతిలో సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణం అత్యంత కీలకం. దానికి అనుసంధానంగా రహదారుల నిర్మాణం పూర్తి చేయాలి. శాశ్వత హైకోర్టు, అసెంబ్లీ, సచివాలయం, విభాగాధిపతుల భవనాలు, హ్యాపీ నెస్ట్ తదితర ప్రాజెక్టులను పునరుద్ధరించాలి. రాజధానిని రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు జాతీయ, రాష్ట్ర రహదారులతో అనుసంధానించాలి. ఎన్ఐడి, ఎస్ఆర్ఎం, విట్ తదితర ప్రతిష్టాత్మక సంస్థలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి. దళితులు అధికంగా నివసించే అమరావతిలో అంబేద్కర్ విగ్రహం, స్మృతి వనాన్ని ఏర్పాటు చేయాలి

రాజధానిలో సాగునీరు, తాగునీరు అవసరాల కోసం వైకుంటపురం వద్ద 45 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలి. అన్నింటికీ మించి రాజధాని పరిధిలోని గ్రామాలతో అమరావతి మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు న్యాయపరమైన చిక్కులను అధిగమించాలి. రాజధాని లో భూములు కేటాయించిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రైవేటు సంస్థలు వెంటనే పనులు ప్రారంభించి నిర్దిష్ట కాల పరిమితితో కార్యకలాపాలు సాగించేలా చూడాలి.

నాకుటుంబాన్ని చంపేయండి-ముద్రగడ

ఏలూరు,ముద్రగడ పద్మనాభరెడ్డిగా పేరు మార్చుకున్న తర్వాత తొలిసారిగా మీడియా ముందుకొచ్చిన మాజీ మంత్రి మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. ప్రజలతో తనను, తన కుటుంబాన్ని బూతులు తిట్టిస్తున్నారని, దాని బదులు తమ కుటుంబాన్ని చంపేయాలని కోరారు. మొత్తం తమ కుటుంబంలో ఏడుగురు ఉన్నారని, అందర్నీ చంపేయాలంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు ముద్రగడ. సవాల్ కి కట్టుబడి ఉన్నాను కాబట్టే తన పేరు మార్చుకున్నానని చెప్పారాయన.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పవన్ చేతుల్లో ఉన్నాయి కాబట్టి కాపులకు రిజర్వేషన్ సాధించాలన్నారు. ప్రత్యేక హోదా, వైజాగ్ స్టీల్ ప్లాంట్ కోసం పోరాడాలి అని గుర్తు చేశారు. సినిమాలు ఆపెయ్ పవన్.. ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చాక సినిమాలు వదిలేశారని, పవన్ కళ్యాణ్ కూడా సినిమాలు వదిలేసి ప్రజాసేవ చేయాలని కోరారు ముద్రగడ. వైసీపీ సానుభూతిపరుల ఇళ్లపై దాడులు జరుగుతున్నాయని, వెంటే వాటిని ఆపేయాలన్నారు.

కూరగాయల ధరలు పైపైకి

అమాంతంగా పెరిగిన టమాటా ధరలు

తగ్గిన దిగుబడులతో ధరలకు రెక్కలు

విజయవా,జూన్22: వర్షాభావంతో మార్కెట్లలో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. పంటల దిగుబడి తగ్గడంతో మార్కెట్లో కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయి..వర్షాలు పడకపోవడంతో కొత్త పంటలకు ఇంకా సమయం ఉంది. రూ.100కు రెండు, మూడు కూరగాయలు కూడా రావడం లేదు. వ్యాపారులను అడిగితే పంట తగ్గిపోయిందని చెబుతున్నారు. ఒక పక్క ఎండ సెగ..మరో పక్క కూరగాయల ధరల మంట చూసి నగరవాసులు ఉసూరుమనాల్సి వస్తోంది.. ఎండల తీవ్రత కూరగాయల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపింది. కూరగాయలు పండించే రైతులకు నీరందక వందలాది ఎకరాల్లో పంట ఎండిపోయి దిగుబడి తగ్గిపోయింది. ఫలితంగా కూరగాయల ధరలు పెరిగిపోయాయి. ప్రజలు నిత్యం వినియోగించే టమాటా చుక్కలు చూపిస్తోంది. ఇప్పటికే మళ్లీ 50 నుంచి 75 రూపాయలకు చివరకు వంద కిలో పెరిగింది. నిత్యం వాడే ఉల్లి ధరలు మళ్లీ 35పైనే పలుకుతన్నాయి. ఎండాకాలంలో పంటల విస్తీర్ణం పరిమితమైంది. దిగుబడి కూడా సగానికి తగ్గి ఉత్పత్తి పడిపోయింది. దీంతో నగరానికి రావాల్సిన కూరగాయల దిగుబడి కూడా గణనీయంగా తగ్గిందని అంటున్నారు. వేసవి ప్రభావం తీవ్రంగా ఉండటంతో భూమిలోని తేమ గంటల వ్యవధిలో ఆవిరవడంతో పంటలకు నీరు అందని పరిస్థితి ఉంది. భూగర్భ జలాలు వేగంగా అడుగంటి పోవడంతో బోర్లు ఉన్నా పనిచేయడం లేదు. ఎండ తీవ్రతకు,వడ గాలులకు వచ్చిన పూత కూడా రాలిపోవడంతో కాయలుకాయడం లేదని అంటున్నారు. టమోటా క్రేటు (30కిలోలు) ధర గతంలో రూ. 200 నుంచి రూ.300 ఉండగా ఇప్పుడు రూ.1200 పలుకుతోంది. కాకర,బెండ,బీర, ధరలు పావుకు 30కి తక్కువగా లేవు. బీన్స్ వందకు పావు అమ్ముతున్నారు. అన్ని కూరగాయల ధరలు దాదాపు ఇదే తీరులో పెరిగాయి. టమోటా, బీర, గోరు చిక్కుడు సాగు చేసిన రైతులు అప్పు చేసి పెట్టుబడి పెట్టారు. తీరా ఇప్పుడిప్పుడే కాపు మొదలైందనుకున్న దశలో ఎండలకు ఉన్న పంట కాస్తా చేతికందకుండా పోతోంది. ఎండ తీవ్రత కారణంగా పంట ఎండిపోయిది. పెట్టుబడి కూడా చేతికి వస్తుందన్న నమ్మకం లేదని కూరగాయల రైతులు వాపోతున్నారు. ఎండల తీవ్రత ఇదే స్థాయిలో ఉండి, వర్షాలు పడకపోతే భూగర్భ జలాలు మరింత తగ్గిపోయి పంటలు ఎండిపోతాయి. ఇప్పటికే 80 శాతం కూరగాయల పంటలు ఎండిపోయే దశలో ఉన్నాయి. దిగుబడి ఇంకా పడిపోయి మార్కెట్కు కూరగాయలు రావడం కష్టమయ్యే పరిస్థితులు నెలకొని ఉన్నాయని నగర మార్కెట్లకు సరఫరా చేస్తున్న వ్యాపారులు అంటున్నారు. ఇలాగే ఎండలు కొనసాగితే ధరలు మరింతగా మండే ప్రమాదం కనిపిస్తోంది.

ఈ జీవితం అశాశ్వతం!

తిరుమల,జూన్22 , విత్తనం చెట్టును కంటుంది. దాన్ని గూడులా భావిస్తుంది. తరవాత అదే చెట్టు పండ్లలోకి వెళ్ళి తలదాచుకుంటుంది. ఎండిన ఆకులు రాలిపోతుంటాయి. కొత్త చిగుళ్లు పుట్టుకొస్తుంటాయి. ఒక రోజు అంతెత్తు వృక్షమూ కుప్పకూలిపోతుంది. అంతకన్న ముందే విత్తనం చెట్టు పండ్ల లోంచి బయటపడుతుంది. మరోచోట ఇంకో చెట్టుగా జన్మ ఎత్తుతుంది. మనిషి జీవితమూ అంతే. సూక్ష్మాతి సూక్ష్మ చైతన్య విత్తనం మనిషి రూపంలో గూడు అల్లుకుంటుంది. ఆ దేహంలోంచి రోజూ కొన్ని కణాలు చనిపోతుంటాయి. కొత్త కణాలు వస్తుంటాయి.

ఆయుష్షు నిండాక ఒకనాడు ఆ మనిషి ఊపిరి తీసుకోవడం ఆగిపోతుంది.మనిషి శరీరంలో మరణించిన కణాలు- గోళ్లు, వెంట్రుకల రూపంలో వెళ్లిపోతుంటాయి. వాటిని కత్తితో కోసినప్పుడు నొప్పి అనిపించకపోవడానికి కారణం- అవి నిర్జీవాలు. ఇలా చిన్న చిన్న విషయాలు తెలిసినప్పుడు మనసు సంతోషంతో నిండిపోతుంది. శిఖరాగ్ర భాగాన నిలిచిన అంతిమ సత్యం పట్ల అవగాహన కలిగినప్పుడు మనసు స్వేచ్ఛ పొందుతుంది. అన్ని రకాల భయాలతో పాటు మరణ భయానికీ స్వస్తి పలుకుతుంది. అందుకే బుద్బుద ప్రాయమైనా జీవితాన్ని పదిలంగా కాపాడుకోవాలి. పదుగరికి ఉపయోగ పడేలా ఉండాలి. ఈ జీవితం అశాశ్వతమని తెలుసుకోవాలి. అప్పుడే ఉన్నంతలో ఆనందంగా గడిపేందుకు అవకాశం ఉంటుంది.

రైతులకు జీలుగుల పంపిణీ.

జీలుగలు పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ.

నంద్యాల/రుద్రవరం–శ్రీ ప్రస్థానం:–ఈరోజు జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ చిన్న కంబలూరు గ్రామంలోని రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రుద్రవరం మండలానికి 450 క్వింటాలు అలాట్ చేయడమైందన్నారు. ఇప్పటివరకు 330 క్వింటాళ్లు 955 మంది రైతులకు పంపిణీ చేయడం జరిగింది అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగేంద్రప్రసాద్, రుద్రవరం మండల వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ, విస్తరణ అధికారి రాజు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ చాణిక్యుడు, మరియు గ్రామ రైతులు జంగా వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీను, నాగేష్, వెంకటేశ్వర్లు, నాగయ్య, కిట్టు తదితర రైతులు పాల్గొన్నారు

మీ అనుభవంతో సభకు హుందాతనం

మంచి నిర్ణయాలు తీసుకునే సత్తా మీకుంది
అందరిపాత్రుడు ఆయన అంటూ..లోకేశ్ అభినందన

అమరావతి,జూన్22:ఎప్పుడూ ప్రజల గురించి ఆలోచించే వ్యక్తి అయ్యన్న. ఏడుసార్లు ఎమ్మెల్యేగా మీకు చాలా అనుభవం ఉంది. మీ నాయకత్వంలో అనేక మంచి పనులు జరిగాయి. నాకు ఎప్పుడూ సలహా కావాలన్నా మీతో సంప్రదించా. ఒకే పార్టీ.. ప్రజలే అజెండాగా ముందుకెళ్లిన వ్యక్తి అయ్యన్న. అనేక అక్రమ కేసులు పెట్టి వేధించినా ఆయన భయపడలేదని మంత్రి నారా లోకేశ్ అన్నారు. అయ్యన్నపాత్రుడు అంటే అందరి పాత్రుడని మంత్రి నారా లోకేష్ అన్నారు. స్పీకర్‌గా అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవ ఎన్నిక అనంతరం శాసనసభలో లోకేష్ మాట్లాడుతూ.. ప్రజల కోసం నిరంతరం పోరాడిన వ్యక్తి అయ్యన్న పాత్రుడని కొనియాడారు. 25 ఏళ్ల వయసులో మంత్రిగా ఎన్నికయ్యారన్నారు. 16 ఏళ్లు మంత్రిగా పని చేసిన అనుభవం అయ్యన్నపాత్రుడికి ఉందన్నారు. ఒకే పార్టీ.. ఒకే జెండా.. ప్రజల అజెండాగా ముందుకెళ్లిన నాయకుడు అయ్యన్నపాత్రుడని పేర్కొన్నారు. అయ్యన్న పాత్రుడిపై గత వైసీపీ ప్రభుత్వం కక్షకట్టిందని నారా లోకేష్ తెలిపారు. య్యన్నపాత్రుడిపై గత వైసీపీ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి వేధించిందని లోకేష్ గుర్తు చేశారు. రాజకీయాలు చూస్తూ పెరిగిన వ్యక్తిని తానని.. గతంలో సభ ఎంతో హుందాగా జరిగేదన్నారు. గత ఐదేళ్లు శాసనసభపై గౌరవం తగ్గేలా వైసీపీ వ్యవహరించిందన్నారు. సభ సంప్రదాయాలను గౌరవించేలా.. సభ ప్రతిష్ట పెరిగేలా సభ్యులను గైడ్ చేయాలని స్పీకర్‌ను లోకేష్ కోరారు. ప్రతిపక్ష హోదా లేకపోయినా.. సభలో ప్రతిపక్షం లేకపోయినా.. మనమే ప్రతిపక్షంగా ప్రజల పక్షాన పోరాడాలన్నారు. అయ్యన్నపాత్రుడిపై ఎన్ని కేసులు పెట్టినా ధైర్యంగా నిలబడి పోరాడారన్నారు. అయ్యన్నపాత్రుడి నుంచి నేర్చుకోవల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయని నారా లోకేష్ అన్నారు.

అక్రమంగా వైసిపి కార్యాయల నిర్మాణం

అనుమతి లేదంటూ సిఆర్‌డిఎ కూల్చివేత

అమరావతి,జూన్22: గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం సీతానగరంలో వైకాపా కార్యాలయం కోసం అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న భవనాన్ని అధికారులు కూల్చివేశారు. నీటి పారుదల శాఖ స్థలంలో పార్టీ కార్యాలయం నిర్మాణాన్ని చేపట్టారు. బోట్ యార్డుగా ఉపయోగిస్తున్న స్థలాన్ని తక్కువ లీజుతో వైకాపా కార్యాలయం కోసం అప్పటి జగన్ సర్కార్ కట్టబెట్టింది. ఈ అక్రమ నిర్మాణంపై వైకాపాకు సీఆర్డీఏ నోటీసులు జారీ చేసింది. శనివారం ఉదయం అధికారులు కూల్చివేతలు చేపట్టారు. ఇరిగేషన్ భూమిని ఆక్రమించి, అనధికారికంగా వైకాపా కడుతున్న పార్టీ కార్యాలయ నిర్మాణాన్ని ఎంటీఎంసీ అధికారులు కూల్చివేశారు. అధికారం అండతో తాడేపల్లిలో 2 ఎకరాల ఇరిగేషన్ భూమిని పార్టీ కార్యాల యానికి జగన్ కేటాయించుకున్నారు. 2 ఎకరాల్లో భవనాలు కట్టి.. మిగిలిన 15 ఎకరాలు కొట్టేయడానికి వైకాపా నేతలు ప్రణాళిక సిద్ధం చేశారు. స్థలం స్వాధీనానికి ఇరిగేషన్ శాఖ అంగీకారం లేదు. సీఆర్డీఏ, ఎంటీఎంఈ, రెవెన్యూ శాఖలు ఈ భూమిని వైకాపాకు హ్యాండోవర్ చేయలేదు.

బస్సు కింద పడుకుని యువకుడు చేసిన స్టంట్‌పై సజ్జనార్ సీరియస్

హైదరాబాద్‌హైదరాబాద్: ఆర్టీసీ బస్సు చక్రాల కింద పడుకొని ఓ యువకుడు చేసిన వీడియోపై తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సీరియస్ అయ్యారు. ఓ యువకుడు ఆర్టీసీ బస్సు కింద పడుకుని స్టంట్ చేసినట్లుగా ఓ వీడియో సోషల్ అవుతున్న విషయం తెలిసిందే. అయితే ఈ వీడియోను బాగా గమనిస్తే.. అది ఫేక్ అని తెలిసిపోతుంది. ఎవరో గ్రీన్ మ్యాట్‌లో వీడియో చిత్రీకరించి, దాన్ని బస్సు కింద పడుకున్నట్లుగా ఎడిట్ చేశారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవడంతో నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాలంటూ డిమాండ్ చేస్తున్నారు. తాజాగా, ఈ వీడియోపై ఆర్టీసీ ఎండీ సజ్జనార్ స్పందించారు.ఈ వీడియో పూర్తిగా ఫేక్ అని సజ్జనార్ తెలిపారు. సోషల్ మీడియాలో పాపులర్ అయ్యేందుకు ఇలాంటి వీడియోలను ఎడిట్ చేసి వదులుతున్నారని తెలిపారు. ఇలాంటి వెకిలిచేష్టలతో ఆర్టీసీ ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం చేయడం మంచి పద్ధతి కాదని హితవుపలికారు. లైక్‌లు, కామెంట్ల కోసం చేసే ఈ తరహా అనాలోచిత పనులను ఇతరులు అనుకరించే ప్రమాదం పొంచి ఉందన్నారు. కొందరు తమ సరదా కోసం ఇలాంటి వీడియోలను ఎడిట్ చేసి షేర్ చేస్తే.. వాటి కారణంగా ఇతరులు ప్రమాదంలో పడే అవకాశం ఉంటుందని చెప్పారు. ఇలాంటి ఘటనలను టీజీ ఆర్టీసీ సీరియస్‌గా తీసుకుంటుందని, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

రైతు భరోసా కేంద్రం సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం.

సమావేశంలో మాట్లాడుతున్న డి ఎ ఓ మురళీకృష్ణ.

నంద్యాల/రుద్రవరం–శ్రీ ప్రస్థానం:–మండల పరిధిలోని చిన్నకంబలూరు మెట్ట సమీపంలో ఉన్న కాశిరెడ్డి నాయన ఆశ్రమం లో రైతు భరోసా కేంద్రం సిబ్బందికి ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికిఆళ్లగడ్డ వ్యవసాయ సబ్ డివిజన్లోని రుద్రవరం, సిరివెళ్ల ,గోస్పాడు మండలాలలో ఉన్న రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఖరీఫ్ సీజను ప్రారంభమైనందున రైతులకు కావలసినటువంటి జీలుగ విత్తనాలు రైతులకు అందించాలని తెలిపారు. అదేవిధంగా గ్రామాల్లో సాగవుతున్నటువంటి వివిధ రకాల పంటలను ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నారో తెలుసుకొని దానికి అనుగుణంగా రైతు భరోసా కేంద్రంలో రసాయనిక ఎరువులు నిలువ ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. అంతేకాకుండా గ్రామాలలో కౌలు రైతు సాగుదారులను గుర్తించి వారికి పంట సాగు దృవీకరణ పత్రాలు (సిసి ఆర్సి) అందజేయాలని సూచించారు. పీఎం కిసాన్ కు సంబంధించి అర్హత ఉండి లబ్ధి పొందని రైతులను గుర్తించి వారికి కూడా పీఎం కిసాన్ నిధులు వచ్చే లాగున కృషి చేయాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాల సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ వారికి సలహాలు సూచనలు ఇస్తూ రైతుల అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ వ్యవసాయ సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు (ఇంచార్జి) నాగేంద్రప్రసాద్ రుద్రవరం ఏవో శ్రీకృష్ణ, గోస్పాడు ఏవో స్వప్నిక అలాగే మూడు మండలాల వ్యవసాయ విస్తరణ అధికారులు రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

పకృతి, పాలకుల సహకారం ఉంటేనే వ్యవసాయం రంగం, రైతుల అభివృద్ధి జరుగుతుంది

.ఏరువాకను ప్రారంభిస్తున్న రైతు సంఘం నాయకుడు రామచంద్రుడు.

నంద్యాల/రుద్రవరం–శ్రీ ప్రస్థానం:–ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రుద్రవరం మండలం చిన్న కంబలూరు గ్రామంలో రైతులు ఏరువాక సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులు తమ జోడు ఎద్దులను, వ్యవసాయ పనిముట్లు అయినా నాగలి, గొర్రు, గుంటగలను పసుపు కుంకులతో పూజించి, ప్రజలందరికీ తిండి గింజలను పండించే నేలతల్లిని పూజించి, కొబ్బరికాయలు కొట్టి సకాలంలో మంచి వర్షాలు కురవాలని, మంచి పంటలు పండాలని, గిట్టుబాటు ధరలు ఉండి వ్యవసాయం, రైతులు అభివృద్ధి చెందాలని కోరుకుంటూ పూజలు నిర్వహించి తమ సేద్యాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నంద్యాల జిల్లా సహాయ కార్యదర్శి టి .రామచంద్రుడు మరియు గ్రామ రైతులు మచ్చ కంటి గోపాల్, బత్తులూరి రామ్ పుల్లయ్య, తలారి నాగేష్, పి కృష్ణారెడ్డి, ఆర్ నాగయ్య., దయ్యాలహరి, చంద్రసేన,, మల్లెపువ్వు సంజీవ తో పాటు రైతులు,గ్రామ రైతు సంఘం నాయకులు, మహిళా రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుంచి మన పెద్దలు వ్యవసాయ సీజన్ ప్రారంభంలో విత్తనాలు వేసే ముందు ఏరువాక పౌర్ణమి రోజున రైతులందరూ తమ జోడు ఎద్దులను, పనిముట్లను పూజించుకొని వ్యవసాయం ప్రారంభించిన సాంప్రదాయం ఉండేది. కాలానుగుణంగా వ్యవసాయ రంగంలో వచ్చినటువంటి మార్పుల వల్ల అధునాతన యంత్రాలు రావటం వల్ల ఎద్దుల సిద్యము క్రమంగా మరుగున పడిపోతున్నది.. పకృతి సహకరించి పంటలు పండిన సకాలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పాలకులు తగిన సహకారం అందించకపోవడం వల్ల రోజురోజుకు రైతాంగం అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకునేటువంటి పరిస్థితి ఏర్పడుచున్నది. అందువల్ల రాష్ట్రంలో దేశంలో కొత్తగా ఏర్పడినటువంటి ప్రభుత్వాలు వ్యవసాయ రంగం రైతుల అభివృద్ధికి ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకొని రైతులకు అవసరమైన అన్ని రకాల నాణ్యమైన విత్తనాలను ఏపీ సీడ్స్ ,నేషనల్ సీడ్స్ ద్వారా అందించాలని, ప్రైవేట్ వ్యాపారస్తుల బారిన పడకుండా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు బ్యాంకుల ద్వారా ఇవ్వాలని, రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని, జిల్లాలోని ప్రధాన సాగునీటి వనరులైన తెలుగు గంగ, కె సి కెనాల్ పంట కాలువలను మరమ్మతులు చేసి కాలువ చివరి భూములకు నీళ్లు అందేలా చేయాలని, మడమత్తులకు నోచుకోని మైనర్ ఇరిగేషన్ చెరువులను తయారు చేయాలని, ప్రొఫెసర్ స్వామినాథన్ కమిషన్ సూచించిన విధంగా మద్దతు ధరల చట్టం పార్లమెంటులో చేయాలని, గ్రామాల్లో పండించుకున్న పంటలను ఆరబెట్టుకోవడం కోసం ప్రత్యేకమైన స్థలాలను కల్లాలను ఏర్పాటు చేయాలని, గ్రామాల్లోని పంట పొలాలకు వెళ్ళేటువంటి ప్రధాన రహదారులను ఏర్పాటు చేయాలని , తద్వారా వ్యవసాయ రంగం అభివృద్ధికి మరియు రైతుల అభివృద్ధికి పాలకులు సహకరించినప్పుడే రైతులు అభివృద్ధి చెందుతారని, తమసమస్యల పరిష్కారం కోసం రైతులందరూ రాజకీయాలు, కుల మతాలకతీతంగా సంఘటితంగా ఉండాలని పిలుపునిచ్చారు.

ఫారెస్టు అధికారుల వేదిపులు తగదు?

సిపిఐ (యం యల్) లిబరేషన్ పార్టీజిల్లా నాయకుడు గాలి రవిరాజ్

నంద్యాల జిల్లాలోని పచర్ల గ్రామంలో వున్నా చెంచులపై ఫారెస్టు అధికారుల వేదింపులు తగ్గించుకోవాలని వారిపై సహనంతో నడుచుకోవాలని సిపిఐ (యం యల్) లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు గాలి రవిరాజ్ కోరారు పచ్చర్ల గ్రామానికి విచ్చేసిన ఆయన అక్కడ వున్నా చెంచు లతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు అనంతరం ఆయన మాట్లాడుతూ పచ్చర్ల గ్రామంలో వున్నా చెంచులకు ఎలాంటి ప్రభుత్వ పధకాలు అందడంలేదని వారి జీవన విధానం అడవిలో వున్నా దోమతేరా కర్రలను తీసుకొని అమ్ముకోవడం అని వారు తెలిపారని గతంలో అధికారుల వేదింపులు లేవని ఇప్పుడు అధికారుల వేదింపులు ఎక్కువైయ్యాయని అందువల్ల తమ జీవన విధానం పై భారం పడి బతుకు దెరువు కోల్పోతున్నామని కనుక అధికారులు తమపై దయచుపాలని వారు కోరారు ఫారెస్టు అధికారులు వారి జీవన విధానం పై దెబ్బ తీయకుండా వారిని ఆదుకోవాలని అలాగే వారికి ప్రభుత్వం నుండి వచ్చే పథకాలను సరిగా అందేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు

కర్నూలు నగరంలో అనుమతి లేని ప్రవేటు క్లినిక్స్, ల్యాబ్స్ సీజ్ చేయాలి...

ప్రజా పరిరక్షణ సమితి డిమాండ్.

కర్నూలు నగరంలో అనుమతీ లేని ప్రవేటు క్లినిక్స్, ల్యాబ్స్ ను సీజ్ చేయాలని ప్రజా పరిరక్షణ సమితి అధ్యక్షుడు కె బలరాం అన్నారు. కర్నూలు నగరంలో అనుమతి లేని పుట్టగోడుల్ల ప్రవేటు క్లినిక్స్, ల్యాబ్స్ ఏర్పాటు చేసి, దళారి వ్యవస్థ ద్వారా ప్రజలను దోపిడి చేస్తున్నారు అని అన్నారు. వెంటనే కర్నూలు నగరంలో అనుమతి లేని ప్రవేటు క్లినిక్స్,ల్యాబ్స్ సీజ్ చేసి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజా పరిరక్షణ సమితి అధ్యక్షుడు కె బలరాం అన్నారు. కర్నూలు జిల్లాలో టఎస్ప్రనీ గారు తక్షణవే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజా పరిరక్షణ సమితి నాయకులు, డేవిడ్, శ్రీ పద్మా నంద యోగీ గారు శ్రీరాములు, తెలుగుబెస్త రవి కిరణ్ కుమార్ రెడ్డి, పురుషోత్తం తది తరులు పాల్గోన్నారు.

మహిళా పోలీసులకు సమ న్యాయం చేయాలి.

-ఏపీ విలేజ్ వార్డ్ సెక్రటేరియట్ మహిళా పోలీస్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు దుర్గం మధులత.

మంగళగిరి:రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న 15వేల మంది మహిళా పోలీసులకు సమ న్యాయం చేయాలని ఏపీ విలేజ్ వార్డ్ సెక్రటేరియట్ మహిళా పోలీస్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఛఎంచిూఓఖఇచిం)రాష్ట్ర అధ్యక్షురాలు దుర్గం మధులత కోరారు. శుక్రవారం ఆమె ఏపీ హైకోర్టు అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం మహిళా పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. మహిళా పోలీసులు ఎదుర్కొంటున్న కోర్టు కేసు విషయాన్ని మధులత ఏపీ హైకోర్టు అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లారు.

డయేరియా వ్యాధి ప్రబలకుండా పకడ్బంది చర్యలు చేపట్టండి

వేడి చేసి చల్లార్చిన నీరే త్రాగాలి
ఆర్డబ్ల్యూఎస్ శాఖ తరచూ నీటి పరీక్షలు నిర్వహించాలి
జిల్లా కలెక్టర్ డా.జి.సృజన

కర్నూలు,శ్రీ ప్రస్థానం:–డయేరియా వ్యాధి ప్రబలకుండా పకడ్బందీ చర్యలుచేపట్టాలని, అందులో ముఖ్యంగా త్రాగే నీరు వేడి చేసుకొని చల్లారిన తరువాతత్రాగేలా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డా.జి.సృజనవైద్యాధికారులు, సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.శనివారంకలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో డయేరియా నివారణలో (స్టాప్‌డయేరియా క్యాంపెయిన్) భాగంగా వైద్యాధికారులు, సంబంధిత శాఖఅధికారులతో జిల్లా స్థాయి స్టీరింగ్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్‌నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లో ఇప్పటివరకు డయేరియాకు సంబంధించిన ఎటువంటి కేసులు నమోదు కానప్పటికీమే మొదటి వారం నుంచి వర్షాలు పడుతున్నందున, వర్షాల వల్ల డయేరియా,డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు.అందుకుగాను డయేరియాతో పాటు డెంగ్యూ, మలేరియా సోకిన వ్యక్తులకుఅవసరమైన వైద్య సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.డయేరియా వ్యాప్తి చెందినప్పుడు మాత్రమే వైద్య సిబ్బంది వైద్య సహాయంచేసే అవకాశం ఉంటుందని, అలా కాకుండా డయేరియాను ప్రబలకుండాఉండేదుకు ముందుగా మున్సిపల్, డిపిఓ, ఆర్డబ్ల్యూఎస్ అధికారులుకలిసికట్టుగా కృషి చేస్తూ ముఖ్యంగా ఆర్డబ్ల్యూఎస్ వారు వాటర్ సోర్సెస్ పైదృష్టి సారించడంతో పాటు ఎప్పటికప్పుడు నీటి నమూనాలను పరీక్షలకుపంపుతూ ఉండాలన్నారు. డయేరియాపై పూర్తి స్థాయి అవగాహన ప్రజలకుకల్పించాలన్నారు.పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలల్లో త్రాగు నీరు వేడిచేసుకొని చల్లారిన తర్వాత త్రాగమని చెప్పడంతో పాటు భోజనం చేసే ముందు చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలని విద్యార్థులకు, చిన్నారులు, అంగన్వాడీ కేంద్రానికి వచ్చే తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. అదే విధంగా అంగన్వాడీ కేంద్రాలలో ఓఆర్ఎస్, జింక్ టాబ్లెట్స్ కూడా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. త్రాగు నీరు నమూనాలను పరీక్ష శాతం పెంచడంతో పాటు నీటిని క్లోరినేషన్ డ్రైవ్ ను కూడా ఈ వారంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈని కలెక్టర్ ఆదేశించారు. సామాజిక సంఘటనలైన జాతరలు, ఉత్సవాలు, పెళ్లిళ్లలో కూడా శుభ్రమైన త్రాగు నీరు, భోజనం తీసుకునేలా ఫుడ్ ఇన్స్పెక్టర్లు, పంచాయతీ సెక్రటరీలు తనిఖీ చేసేలా ఆదేశాలు జారీ చెయ్యాలని డిపిఓను కలెక్టర్ ఆదేశించారు.ప్రతి మండలంలో కూడా డయేరియా నివారణకు గాను సంబంధిత శాఖల సిబ్బందిని నియమించి జిల్లా స్థాయిలో స్టీరింగ్ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వారికి వివరించి సదరు ఆదేశాలు/నిర్ణయాలను కూడా మండల స్థాయి సమావేశాల్లో వివరించాలన్నారు. హోటల్స్, డాభాల్లో కూడా శుభ్రమైన త్రాగు నీరు, భోజనం అందించేలా యాజమాన్యాలకు అవగాహన కల్పించాలన్నారు. డయేరియా వ్యాప్తి చెందకుండా పూర్తి స్థాయిలో అధికారులు కృషి చేయాలన్నారు. అదే విధంగా డెంగ్యూ వ్యాధిని నివారణకు కూడా చర్యలు తీసుకోవడంతో పాటు సదరు దోమలు శుద్ధమైన నీరులోనే ఉంటాయని వాటి నివారణకుగాను మంచి నీటిపై ఎప్పుడు మూతలు ఉంచడంతో పాటు ఇంటి పరిసరాల్లో నీరు ఎక్కడ నిల్వ ఉండకుండా సచివాలయ సిబ్బంది పరిశీలించి సంబంధిత సిబ్బందితో శుభ్రం చేయించి పరిశుభ్రంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు సమన్వయంతో వ్యవహరించి డయేరియా, డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా గట్టి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.అంతకుముందు సంబంధిత వైద్య సిబ్బంది డయేరియా నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్ కు వివరించారు.

EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJITHA PRINTERS, H.NO: 46/801, BUDHAWARAPETA, KURNOOL DIST. - 518001, ANDHRA PRADESH, INDIA. PUBLISHED AT H.NO: 43/217A, N R PETA, KURNOOL DIST., ANDHRA PRADESH, INDIA. EDITOR : PERUMALLA CHENNAKESHAVULU.RNI No : APTEL 2020/80757